PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 23-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 55 Issue: 55

Circulated to Telangana
Published from Jagitial

23 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి ఏకాదశి తె. 4:18 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మూల సా. 5:35 వరకు తరువాత పూర్వాషాఢ యోగం విష్కంభ ఉ. 6:13 వరకు కరణం వనిజ మ. 3:10 వరకు విష్టి తె. 4:18 వరకు వర్జ్యం మ. 3:56 నుండి సా. 5:44 వరకు దుర్ముహూర్తం సా. 4:53 నుండి సా. 5:43 వరకు రాహుకాలం సా. 4:59 నుండి సా. 6:33 వరకు యమగండం మ. 12:18 నుండి మ. 1:52 వరకు గుళికకాలం మ. 3:25 నుండి సా. 4:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు ఉ. 10:38 నుండి మ. 12:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:43 వరకు గమనిక: "о" అనగా మరుసటి రోజున

# పిల్లలకు ఆ దగ్గు మందు డేంజర్!




చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్లలోపు చిన్నారులకు క్లోర్‌ఫెనిరమైన్ మలేట్, ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

న్యూఢిల్లీ: సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై 'ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు' అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) చేసిన సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో తరువాయి 2 వ పేజీలో...

# అది రేవంత్ ప్లానే!?



టూర్ క్యాన్సిల్‌పై అనుమానాలు!.. కొండా సుస్మిత, చిన్నారెడ్డి ఎఫెక్ట్??

15 రోజుల ముందే కేంద్రానికి సమాచారం!.. తీరా పర్యటనలో ఉండగా రద్దు ఏంటో?

రాజకీయ వర్గాల్లో డౌటనుమానాలు.. కేంద్ర అనుమతి నిరాకరణ వెనుక ఆరెస్సెస్ నేత?

### సీఎం రేవంత్ పర్యటన ఎప్పుడు ఖరారైంది?

బ్రిటన్ (యూకే), అమెరికా (యూఎస్) పర్యటనల పూర్తి షెడ్యూల్ పర్యటనకు రెండు రోజుల ముందుగా, అంటే ఆగస్టు 18న అధికారికంగా ఖరారైంది. అయితే, 15 రోజుల ముందుగానే కేంద్రానికి అధికారులు సమాచారమిచ్చినట్లు తెలిసింది. ఆగస్టు 13న పత్రికలు, చానళ్లలో విదేశీ పర్యటనపై వార్తలు వచ్చాయి.

### విదేశాలకు ఎప్పుడు వెళ్లారు?

సీఎం రేవంత్ ఆగస్టు 20వ తేదీన ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం, అదే రోజు రాత్రి న్యూఢిల్లీ నుంచి విమానంలో నేరుగా లండన్ బయలుదేరి వెళ్లారు.

### అమెరికా పర్యటనకు ఏర్పాట్లు చేశారా?

అమెరికా పర్యటన కోసం షెడ్యూల్, పూర్తి ఏర్పాట్లు చేశారు. లండన్ పర్యటన ముగించుకుని ఆగస్టు 24న అమెరికా చేరుకునేలా, అక్కడ బాస్టన్, న్యూయార్క్ నగరాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లను సందర్శించి పలువురు ప్రతినిధులతో భేటీ అయ్యేలా ఏర్పాట్లు జరిగాయి. అంటే.. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం అనుమతి వచ్చాకే పర్యటన ఖరారు అవుతుందని అర్థం.

### మొత్తం ఎన్ని రోజుల విదేశీ పర్యటన?

ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 20 నుంచి ఆగస్టు 30 వరకు మొత్తం 11 రోజుల పాటు ఈ పర్యటనలో ఉండాల్సింది. అయితే, యూకే పర్యటనను మాత్రమే ముగించుకుని వెనక్కి తిరిగి వస్తున్నారు.

2

# భూగర్భంలో 'ఎల్పీజీ' నెట్‌వర్క్

### రూ.7 వేల కోట్లతో కొత్త గ్యాస్ పైప్‌లైన్‌లు

### కేంద్రం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: దేశంలో ఎల్పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠంచేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ.7 వేల కోట్ల వ్యయంతో ఎల్పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి ఆమోదం తెలిపింది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో తరువాయి 2 వ పేజీలో...



# ఆక్స్‌ఫర్డ్‌కు ఆహ్వానం

### ప్రపంచ విద్యను తెలంగాణకు తెండి

### వర్సిటీ ప్రతినిధులకు రేవంత్ వినతి

### తెలంగాణ రైజింగ్ విజన్‌పై వివరణ

తెలంగాణను ప్రపంచ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అందులో భాగంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో శుక్రవారం 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు.

లండన్/హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లోవాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్‌ను వారికి సమగ్రంగా వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. -2 వ పేజీలో...

# దానంపై వేటు?

### అనర్హత పిటిషన్ తీర్పు రిజర్వు

### వచ్చే నెల 16న తుది తీర్పు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది.



హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశారని వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# తిడుతుంటే.. సప్పుడు చేయరేం?

### నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారు

### బహిరంగ విమర్శలు చేస్తున్నారు

### వాళ్ల వెనుక ఉన్న అదృశ్య శక్తి ఎవరు?

### టీపీసీసీకి కొండా సురేఖ ఘాటు లేఖ



కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ చైర్మన్ మల్లు రవిని కోరారు. కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,309 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,742 |



# చినుకు అలకవీడె

### ఐదు రోజులు వర్షాలు.. వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): రాష్ట్రానికి వాతావరణ శాఖ వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 26 వరకూ రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దానితో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాలలో ఆకాశం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ధమనుల్లో వాపును పెంచే నిర్దిష్ట రోగనిరోధక కణాలను నియంత్రించడం ద్వారా గుండె జబ్బుల పురోగతిని అడ్డుకోవచ్చని పరిశోధకులు గుర్తించారు. ఈ విధానం రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడిన తర్వాత చికిత్స చేయడం కంటే, ముందుగానే వాపును తగ్గించి వ్యాధి ముదరకుండా నిరోధించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. అయితే పరిశోధన ఇంకా ప్రారంభ దశలోనే ఉండటంతో, మానవులపై మరిన్ని అధ్యయనాలు, క్లినికల్ పరీక్షలు అవసరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.




# 10,060 పోస్టులో ఏపీ జాబ్ క్యాలెండర్

### 4 దశల్లో భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీ

### సెప్టెంబర్, అక్టోబర్‌లో వరుసగా నోటిఫికేషన్లు

ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన "జాబ్ క్యాలెండర్-2026"ను విడుదల చేసింది.

విజయవాడ, ఆగస్టు 22 (ఈవార్తలు): ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఆగస్టు 22, 2026న జీవో నెం.81ను జారీ చేశారు. ఈ నియామక ప్రక్రియను నాలుగు విడతల్లో పూర్తి తరువాయి 2 వ పేజీలో...

# అన్నం 'పురుగుల' స్వరూపం

### మోసపూరిత ప్రకటనలు, తప్పుడు లేబుల్స్

### జనాలను మోసం చేస్తున్న దిగ్గజ కంపెనీలు

### నెస్లే, కోకాకోలా సహా 150 సంస్థలకు నోటీసులు




వినియోదారులను ఆకట్టుకోడానికి మోసపూరిత ప్రకటనలు, తప్పుడు వాదనలు, లేబెలింగ్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతోన్న పలు సంస్థలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల అధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కఠిన చర్యలు చేపట్టింది. నెస్లే ఇండియా, పెప్సికో, కోకా-కోలా వంటి ప్రముఖ దిగ్గజాలు సహా పలు కంపెనీలకు గత కొన్ని నెలల్లో 150కి పైగా నోటీసులు జారీ చేసినట్లు తాజాగా ప్రకటించింది.

న్యూఢిల్లీ: నెస్లే, పెప్సికో, అబాట్ ఇండియా, రెడ్ బుల్, డానోన్, మోండెలెజ్ (డైరీ మిల్క్), కోకా-కోలా, దయాజియో, ఫెర్రెరో ఇండియా వంటి బడా సంస్థలకు నోటీసులు ఇచ్చింది. కేఎఫ్‌సీ, మెక్‌డొనాల్డ్స్, పిజ్జా హట్, డోమినోస్, కాఫీ డే వంటి ప్రముఖ ఫుడ్ సర్వీస్ సంస్థలకు 30కి పైగా నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా నిబంధనలు పాటించని డోమినోస్‌కు చెందిన 5 లైసెన్స్‌లను తరువాయి 2 వ పేజీలో...




# భయపెట్టకే.. బంగారమా!

### వేలకు వేలు పెరుగుతున్న పసిడి

### వారంలో ఏకంగా రూ.7,960 పైకి

బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. శనివారం కూడా గరిష్ఠంగా రూ.1520 పెరిగిన పసిడి ధర.. వారం రోజుల్లో ఏకంగా రూ.7,960 పెరిగి, జీవితకాల గరిష్టాలను తాకింది. ఆగస్టు 16 నుంచి 22 వరకు పరిశీలిస్తే.. హైదరాబాద్, విజయవాడలలో ఆగస్టు 16న రూ.1,55,130 వద్ద ఉన్న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర, ఆగస్టు 22 నాటికి 1,63,090 రూపాయల వద్దకు చేరింది.

న్యూఢిల్లీ/ముంబై: వారం రోజుల్లో పెరిగిన గోల్డ్ రేటు రూ. 7960 అన్నమాట. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు విషయానికి వస్తే.. ఏడురోజుల్లో 1,42,200 రూపాయల నుంచి రూ.1,49,500 వద్దకు (రూ.7300 పెరిగింది) చేరింది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,55,130 నుంచి రూ. 1,63,090 వద్దకు చేరింది. అంటే ఏడురోజుల్లో రూ. 7960 పెరిగింది. 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,42, 200 నుంచి రూ.1,49,500 (రూ.7300 పెరిగింది) వద్దకు చేరింది. ఢిల్లీలో బంగారం ధరల్లో గణనీయమైన మార్పు కనిపించింది. ఇక్కడ రూ.1,55, 280 వద్ద ఉన్న 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రూ.1,63,240 వద్దకు చేరింది.

# రాశి ఫలాలు



23.8.2026

**మేషం:** చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

**వృషభం:** ఇంటా బయట పరిస్థితులు కొంత నిరుత్సాహ పరుస్తాయి. శ్రమాధిక్యతతో కానీ పనులు పూర్తికావు. బంధుమిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్య పరుస్తుంది. అనారోగ్య సమస్యలు భాధిస్తాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు.

**మిధునం:** చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సంతాన వివాహ విషయంలో చర్చలు సఫలం అవుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**కర్కాటకం:** నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలుగుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

**సింహం:** కొన్ని వ్యవహారాలు మందగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ఒడిదుడుకులుగా ఉంటుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

**కన్య:** దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కీలక వ్యవహారాలలో రెండు రకాలయిన ఆలోచనల వలన ఇబ్బందులు తప్పవు. బంధువులు, మిత్రులు మీ మాటతో విభేదిస్తారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు.

**తుల:** చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యత నుండి ఉపశమనం పొందుతారు. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి.

**వృశ్చికం:** కీలక వ్యవహారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో సమస్యలను అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

**ధనస్సు:** ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహ పరుస్తాయి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఇంటాబయట బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు స్థాన చలన సూచనలు ఉన్నవి.

**మకరం:** ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. సొంత నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమై విశ్రాంతి లభించదు. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి.

**కుంభం:** అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఇంటా బయట మీ మాటకి విలువ పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగవుతుంది. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు.

**మీనం:** చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలించక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. దూరప్రయాణాలు వలన శారీరక శ్రమ అధికమవుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించడం మంచిది. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. ఉద్యోగమున సహోద్యోగుల ప్రవర్తన కొంత చికాకు పరుస్తుంది.

# అది రేవంత్ ప్లానే!?

**టూర్ క్యాన్సిల్‌పై అనుమానాలు!**

**కొండా సుస్మిత, చిన్నారెడ్డి ఎఫెక్ట్??**

**15 రోజుల ముందే కేంద్రానికి సమాచారం!**

**తీరా పర్యటనలో ఉండగా రద్దు ఏంటో?**

**రాజకీయ వర్గాల్లో అనేక డౌటనుమానాలు**

**కేంద్ర అనుమతి నిరాకరణ వెనుక ఆరెస్సెస్ నేత?**

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి పర్యటన అర్ధంతరంగా రద్దు.. ప్రస్తుతం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తున్న అంశమిది. పర్యటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ముందుగానే సమాచారం ఉన్నప్పటికీ, ఉన్నఫలంగా పర్యటన రద్దు కావడం.. అదీ, విదేశీ పర్యటనలో ఉండగానే అలా జరగడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు సంబంధించిన వివరాలను రాష్ట్ర అధికారులు సుమారు 15 రోజుల ముందుగానే కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత విభాగాలకు తెలియజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో లండన్ పర్యటనకు అనుమతి లభించగా, అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ పర్యటన రద్దు వెనుక సీఎం రేవంత్ రెడ్డే ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు సీఎం విదేశీ పర్యటనలో ఉండగా గుప్పుమన్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా సురేఖ కుటుంబానికి చెందిన నాయకులు, సీనియర్ నేత జీ చిన్నారెడ్డి తదితరుల వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపాయి. అదీకాక, తెలంగాణలో సీఎం మార్పు అంశం కొంతకాలంగా చర్చకు వస్తోంది. రేవంత్‌రెడ్డి నాయకత్వంపై అధిష్ఠానానికి పలువురు నేతలు ఫిర్యాదు చేసినట్లు కూడా ప్రచారం జరిగింది. డిసెంబర్‌లోపు నాయకత్వ మార్పు జరిగే అవకాశం ఉందంటూ కొందరు సీనియర్ నేతలకు సంకేతాలు అందాయన్న వాదనలు వినిపించాయి. ఇలాంటి పరిస్థితుల్లో 10 రోజులు రాష్ట్రానికి దూరమైతే పరిస్థితులు తలకిందులుగా మారే ప్రమాదం ఉందనే.. రేవంత్ తన పర్యటనను కుదించుకున్నట్లు చర్చ నడుస్తోంది. స్వయంగా తానే పర్యటన రద్దు చేసుకుంటే.. 'రాష్ట్రంలోని, పార్టీలోని పరిస్థితులకు భయపడి హుటాహుటిన వచ్చేశారు' అని అంటారన్న భయంతో కేంద్రం నుంచి పర్యటన మధ్యలోనే రద్దయ్యేలా చేసుకున్నారని మాట్లాడుకుంటున్నారు. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన అంశానికి సంబంధం లేదని, అందుకే తాము రేవంత్ అమెరికా పర్యటనను రద్దు చేశామని కేంద్రం వివరణ ఇచ్చినప్పటికీ, తెరవెనుక ఆరెస్సెస్ కీలక నేత హస్తం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆరెస్సెస్‌లో కీలక స్థానంలో ఉన్న రేవంత్ సన్నిహితుడి ద్వారా కేంద్ర స్థాయిలో సంప్రదింపులు జరిగాయని, దాంతోనే అమెరికా పర్యటన రద్దయ్యిందని ఆ గుసగుసల సారాంశం.



### రేవంత్‌కే ఎందుకిలా?

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు వెళ్లాలంటే కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటేరియట్ మార్గదర్శకాల ప్రకారం, ముఖ్యమంత్రులు లేదా రాష్ట్ర మంత్రులు విదేశాలకు వెళ్లాలనుకున్నప్పుడు ముందుగానే కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలి. ముఖ్యమంత్రులు తమ వ్యక్తిగత లేదా అధికారిక విదేశీ పర్యటనలకు తప్పనిసరిగా కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి ఈ క్లియరెన్స్ తీసుకోవాలి. ఇతర అనుమతుల కోసం విదేశీ వ్యవహారాల శాఖతో పాటు ప్రధాన మంత్రి కార్యాలయం, క్యాబినెట్ సెక్రటేరియట్ నుంచి తుది ఆమోదం కావాలి. అలాగే ఖర్చులకు సంబంధించి ఆర్థిక శాఖ క్లియరెన్స్, విదేశీ ఆతిథ్యం లేదా నిధులు ఉంటే హోం శాఖ నుంచి ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతి కూడా అవసరం. గతంలో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు (2019, 2022లో), పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి (2018, 2021లో) కేంద్రం విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరించినప్పటికీ, అవి వారు విదేశాలకు వెళ్లకముందే అనుమతి నిరాకరించారు. కానీ, విదేశాలకు వెళ్లిన తర్వాత మధ్యలో ఒక షెడ్యూల్ రద్దు కావడం అనేది రేవంత్ రెడ్డి విషయంలోనే జరిగింది.

# తిడుతుంటే.. సప్పుడు చేయరేం?

**మొదటి పేజీ తరువాయి**

పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖ రాయడానికి ముందు మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని పేర్కొన్నారు.




# పిల్లలకు ఆ దగ్గు మందు డేంజర్!

**మొదటి పేజీ తరువాయి**

2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డీసీ మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా.. తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్లలోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావంచూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టంచేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్–1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

# అన్నం 'పురుగుల' స్వరూపం

**మొదటి పేజీ తరువాయి**

రద్దు చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించినందుకు గాను ఓ అమెజాన్ వేర్‌హౌస్ లైసెన్స్‌ను అధికారులు రద్దు చేశారు. ఈ కామర్స్ కంపెనీలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు 12 నోటీసులు జారీచేసింది. ఎనర్జీ డ్రింక్స్ తయారీ సంస్థలు (మోన్‌స్టర్, హెల్), ఆల్కహాలిక్ పానీయ సంస్థలపై కూడా దాడులు చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నోటీసులు అందుకున్న తర్వాత అనేక కంపెనీలు తమ ప్రకటనలు, లేబెలింగ్‌లలో సరిదిద్దుకునే చర్యలు ప్రారంభించాయని ఎఫ్‌ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. ఇటీవల దేశవ్యాప్తంగా పలు మెట్రో సిటీలు సహా అనేక నగరాల్లో సోదాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఫైవ్‌స్టార్ హోటల్స్, బడా రెస్టారెంట్లలో అపరిశుభ్ర పరిస్థితులకు కళ్లకు కడుతున్నాయి. వందల కిలోల కుళ్లిపోయిన మాంసం, పాడైపోయిన ఆహార పదార్థాలు చూసి అధికారులు విస్తుపోతున్నారు. ఇటీవల బెంగళూరులోని కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యే క్యాంటీన్లలో గడువు ముగిసిన సరుకులను గుర్తించిన సంగతి తెలిసిందే.



# భూగర్భంలో 'ఎల్పీజీ' నెట్‌వర్క్

**మొదటి పేజీ తరువాయి**

సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితోపాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝూన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడంవల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.




# 10,060 పోస్టులో ఏపీ జాబ్ క్యాలెండర్

**మొదటి పేజీ తరువాయి**

చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీపీఎస్సీ, ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ (పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు), డీఎస్సీ వంటి నియామక సంస్థల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలైన మౌలిక సదుపాయాల కల్పన, విద్య, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, "స్వర్ణాంధ్రఏ2047" లక్ష్యాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయనుండగా, వాటి షెడ్యూల్ కింది విధంగా ఉంది:

మొదటి విడత: 1,523 పోస్టులు (ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ 2026 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది).

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 సెప్టెంబర్ 15).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15)

# చినుకు అలకవీడె

**మొదటి పేజీ తరువాయి**

మేఘావృతమై ఉంటుందని తెలిపింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, నల్లగొండ, సూర్యాపేటలో వేగంగా బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఉరుములు, మెరుపులు వచ్చేటప్పుడు చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని వాతావరణ శాఖ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది.

# ఆక్స్‌ఫర్డ్‌కు ఆహ్వానం

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారి చిత్రపటాన్ని తిలకించారు.








# పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

## జర్నలిజం వ్యాపారం కాదు.. అదొక సామాజిక బాధ్యత.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్‌లో 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం**

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ద హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్ రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ నుంచి గౌతమ్ లాహిరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారతీయ జర్నలిజం వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను ఆయన సోదాహరణంగా వివరించారు. వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదే అని చెప్పారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం రిపోర్ట్ చేయడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందని భట్టి స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత, కొందరు అక్కడ 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏఐసీసీ అధ్యక్షుడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి పట్ల బహిరంగంగా ఇలా జరిగితే... దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో మనం ఇంకా ఎంత దూరం ప్రయాణించాలో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశ నిర్మాణంలో జర్నలిజం ఒక అంతర్భాగమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుర్తుచేశారు. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదని, పౌరులను తీర్చిదిద్దడమని పేర్కొన్నారు. యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్ పత్రికల ద్వారా జాతిపిత మహాత్మా గాంధీ ప్రజలను స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్లించారని అన్నారు. మూక్ నాయక్, బహిష్కృత భారత్ వంటి పత్రికలను బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించి అణగారిన వర్గాలకు గొంతుకనిచ్చారని అన్నారు. కేసరి, మరాఠా పత్రికల ద్వారా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వలస పాలకులను సవాలు చేశారని అన్నారు. దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి వారంతా పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు ఆయుధాలుగా మలిచారని ఆయన కొనియాడారు. ఆ కాలంలో అమృత బజార్ పత్రిక, ది హిందూ వంటివి ప్రజల గొంతుకలుగా నిలిచాయని చెప్పారు. ప్రజాస్వామ్యంలో పాలకులకు, పత్రికలకు మధ్య ఉండాల్సిన సంబంధాన్ని ఒక చారిత్రక సంఘటనతో ఉపముఖ్యమంత్రి వివరించారు. 1948లో 'శంకర్స్ వీక్లీ'లో తనను నిరంతరం కార్టూన్లతో విమర్శించే శంకర్‌తో అప్పటి ప్రధాని నెహ్రూ "నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్" అన్న మాటలను భట్టి గుర్తుచేశారు. ఒకప్పుడు పత్రికా సంపాదకుడి పదవికి దేశంలో రెండో అత్యంత ముఖ్యమైన స్థానం ఉండేదని, రామ్‌నాథ్ గోయెంకా లాంటి యజమానులు ప్రభుత్వాలను సైతం సవాలు చేసేవారని ఆయన అన్నారు. నేటి వార్తా సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా భావప్రకటనా స్వేచ్ఛను విస్తృతం చేసినప్పటికీ, స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదని ఆయన హితవు పలికారు. "నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే" అన్న సామెతను గుర్తు చేస్తూ... ఒకరి ప్రతిష్టను దెబ్బతీసే లైసెన్స్‌గా భావప్రకటనా స్వేచ్ఛ మారకూడదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో పుకార్లు దేశమంతా వ్యాపిస్తున్న ఈ కాలంలో... జర్నలిస్టులకు అసలైన ఆస్తి 'విశ్వసనీయత' మాత్రమేనని ఉద్ఘాటించారు. మనసులోని మాటను నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ తెలంగాణ గడ్డ స్వభావంలోనే ఉందని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని పూర్తిగా గౌరవిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నెహ్రూ చెప్పినట్లుగానే "మమ్మల్ని కూడా విడిచిపెట్టవద్దు.. స్వేచ్ఛగా మాట్లాడండి, స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఆ విమర్శలను వినే ధైర్యం అధికారంలో ఉన్న మాకు ఉంది" అని ఆయన జర్నలిస్టులకు భరోసా ఇచ్చారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

# ప్రజల ఆస్తుల కబ్జా

**22ఏ ముసుగులో కమీషన్ల దందా**

**మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం**

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): 22ఏ నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములు, ఆస్తులను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారు? అని, ఇది 30% కమీషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీశ్ రావు విమర్శించారు. శనివారం బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ఏ బాధితులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..బాధితుల ఆవేదన వింటుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గం అని మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను.. 22ఏను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ఏ భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని, దీనికి మీ సమాధానం ఏమిటో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 22ఏ బాధితులందరూ అధైర్యపడవద్దు అని, ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని హరీశ్ రావు భరోసా ఇచ్చారు. ఈ వివాదంలో ప్రభుత్వం ప్రకటనలు, మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని, లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# వాళ్లు బుర్రలేనోళ్లు!

**ఇంజినీరింగ్ విద్యార్థులు పనికి రారు అనడం తప్పు**

**'విజ్ఞాన్' అధినేత డాక్టర్ లావు రత్తయ్య కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): ఇంజనీరింగ్ విద్యార్థులు క్రిమినల్ వేస్ట్.. వారికి కనీసం జాబ్ అప్లికేషన్ నింపడం కూడా రాదు.. సంవత్సరానికి లక్షా 10 వేల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ సర్టిఫికేట్ తీసుకుంటున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ నేపథ్యంలో విజ్ఞాన్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ లావు రత్తయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. దురదృష్టవశాత్తు ప్రభుత్వంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కూడా ఇంజనీరింగ్ విద్యార్థులు పనికి రారంటున్నారు. అలా అంటున్నవాళ్లకు బ్రెయిన్ లేదని మండిపడ్డారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు ఎప్పుడూ కూడా పనికిరాని వారు కాదు. రెండు మూడు కేసుల్లో కానీ, ఓ ఐదారు శాతం కానీ ఉండొచ్చు. వారిలో ఎక్కువ మంది సుమారు 80 శాతం ప్రొడక్టివ్.. అంతకంటే ఎక్కువ పోటీతత్వం ఉన్నవాళ్లు. వారు యూఎస్‌కు వెళ్తున్నారు. వారిలో ఒక్క విద్యార్థి కూడా డిగ్రీ లేకుండా ఇండియాకు తిరిగొస్తలేరన్నారు. ఈ విద్యార్థులు ఎక్కువ ఫోకస్ ఉన్నవాళ్లు, కష్టపడే తత్వం ఉన్నవాళ్లని అన్నారు. ప్రభుత్వంలో ఉన్నబాధ్యత గల వ్యక్తులు ఎలా వారిని పనికిరాని వారని అంటారో నాకు తెలియదని లావు రత్తయ్య పేర్కొన్నారు. యువత పవర్ ఏంటో ఇటీవలే జంతర్ మంతర్‌లో, తమిళనాడు ఎన్నికల్లో కూడా చూశామని ఆయన అన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన స్వాతంత్ర్య ఉద్యమం లాంటిది. పోలీసులు లాఠీ ఛార్జ్ చేస్తే పారిపోకుండా పోరాడిన నిరసనకారులను స్వాతంత్ర్య ఉద్యమంలో చూశాం, మళ్లీ మొన్న జంతర్ మంతర్ వద్ద చూశామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ నాయకులు గతంలో లాగా నోటికొచ్చినట్టు మాట్లాడితే కుదరదు. ఇప్పుడున్న యువత కేవలం డాటా చూసి ఊరుకోరు.. కచ్చితమైన ఆధారాల సేకరణ, డేటా విశ్లేషణ తర్వాతే యువత ఓటు వేస్తారు. కేటీఆర్ యువతకు బాగా కనెక్ట్ అయి ఉన్నాడని.. అది ఏదో ఒక మార్పును సూచిస్తుందని అన్నారు.

**గచ్చిబౌలిలో కూలిన భవనం**

# ఇద్దరి దుర్మరణం

## అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్టు గుర్తింపు

గచ్చిబౌలి–హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. 'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

**ఎవరినీ వదలం: రంగనాథ్**

ఎవరినీ వదిలిపెట్టేది లేదని.. అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని కూల్చేస్తామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో కూలిపోయిన ఏడు అంతస్తుల భవనాన్ని రంగనాథ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇక ఎవరిని ఉపేక్షించం. ఈ భవనాలన్నీ నాలాల పక్కన ఉన్నాయి. 50 గజాల్లోనే ఏడేసి అంతస్తులు కట్టారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలన్నీ కూలుస్తాం. భవనాలు అన్ని నాలాను ఆనుకునే నిర్మించారు. బిల్డర్ సాజిద్ పరారీలో ఉన్నాడు. 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లకు ఇస్తున్నాడు" అని రంగనాథ్ తెలిపారు. ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతి చెందాడు. బిల్డింగ్ యజమాని అందుబాటులోకి రాలేదు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు ఇచ్చారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఏడు అంతస్తులు, ఒక



పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తులు బిల్డింగ్ నిర్మాణం జరుగుతుంది. నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. చుట్టుపక్కల ఉన్న భవనాలను కూడా పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తాం. హాస్టల్ బిల్డింగులు నిర్మించి రెంట్‌కు ఇస్తుంటాడు సాజిద్.. అతనిపై ఇప్పటికే చాలా ఫిర్యాదులు ఉన్నాయి" అని పేర్కొన్నారు.



# సురేఖ రాజీనామా చెయ్.. నీ వైఖరి తప్పు

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కూతురు సుస్మితాపటేల్ చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ చెప్పడం అసంబద్ధం అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. కూతురు చేసిన వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ నైతిక బాధ్యత వహించాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందేనని మంత్రి అడ్లూరి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై కుట్రలు జరుగుతున్నాయి అని అడ్లూరి ఆరోపించారు. అయినప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో 2029లో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, 2029లోనూ రేవంత్ రెడ్డినే సీఎంగా కొనసాగుతారని అడ్లూరి లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. అటు.. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కూతురు కొండా సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ వివరణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శనివారం టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవిని కలిసి అధికారికంగా ఫిర్యాదు చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తొలగించాలని, పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల ఫిర్యాదుపై మల్లు రవి స్పందిస్తూ..మంత్రి కొండా సురేఖ ఇచ్చిన వివరణను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నేనూ పాలిటెక్నిక్ విద్యార్థినే

**మీ కష్టాలు నాకు తెలుసు: హరీశ్ రావు**

సిద్దిపేట, ఆగస్టు 22 (ఈవార్తలు): పాలిటెక్నిక్ విద్యార్థుల బాధలు తనకు తెలుసు అని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సిద్దిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాజ్‌గోపాల్ పేట్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విద్యార్థులను చూసి ఆగి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. నేను కూడా ఒక పాలిటెక్నిక్ విద్యార్థినే. ఆ చదువుల ప్రాముఖ్యత, విద్యార్థుల కష్టాలు నాకు బాగా తెలుసు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు 7 దశాబ్దాల సుదీర్ఘమైన, ఘనమైన చరిత్ర ఉంది. ఎందరో నిరుపేద విద్యార్థులు ఈ చదువుల ద్వారానే దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న వారిలో 95 శాతం మంది నిరుపేద విద్యార్థులేనని.. నామమాత్రపు ఫీజులు కట్టి, నాణ్యమైన ఇంజనీరింగ్ స్థాయి విద్యను డిప్లొమాలోనే వాళ్లు నేర్చుకుంటున్నారు. పాలిటెక్నిక్‌ను ఐటీఐలో కలపడం వల్ల అది తన స్టేటస్ కోల్పోతుందన్నారు హరీశ్ రావు. ఇప్పుడున్న విధానం ప్రకారం పాలిటెక్నిక్ పూర్తవగానే ఇంజనీరింగ్ సెకండియర్‌లో నేరుగా అడ్మిషన్ పొందే అవకాశం ఉంది. ఐటీఐలతో కలిపితే మళ్లీ ఇంటర్మీడియట్ చదివితే తప్ప ఇంజనీరింగ్ సీటు రాని దుస్థితి వస్తుందని విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఇంతటి పటిష్టమైన విద్యావ్యవస్థను తెలంగాణ విద్యాచట్టం పరిధి నుంచి తొలగించి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి మార్చడం దారుణం. దీనివల్ల నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ చదువులకు దూరమై, వ్యవస్థ పూర్తిగా పతనమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇన్నాళ్లవుతున్నా నేటికి విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేడు. ఆ శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా చూస్తున్నా.. విద్యార్థుల సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. విద్యార్థులు, మేధావులతో ఎలాంటి ముందస్తు అభిప్రాయ సేకరణ చేపట్టకుండా, కనీస విధివిధానాలు కూడా బహిర్గతం చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి అయోమయంలో పడ్డారు. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన.. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలోకి విలీనం చేసే బిల్లును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# రెడ్లకో న్యాయం, బీసీలకో న్యాయమా?

**కొండా సురేఖకు నోటీసులపై బీసీ నాయకుల ఫైర్**

హనుమకొండ, ఆగస్టు 22 (ఈవార్తలు): దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేయడంపై బీసీ సంఘాల నాయకులు తీవ్రంగా స్పందించారు. బీసీల పట్ల ఒక రకమైన న్యాయం, రెడ్డి సామాజిక వర్గం పట్ల మరో రకమైన న్యాయం జరుగుతోందని బీసీ ఐక్యవేదిక నాయకులు ప్రశ్నించారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సామాజికవేత్త, బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి చెందిన సామాజిక వర్గానికి చెందిన కొంతమంది శాసనసభ్యులు అనేక సందర్భాల్లో ఏకవచనంతో విమర్శించినప్పటికీ, అప్పట్లో ప్రభుత్వం అదే స్థాయిలో స్పందించలేదని ఆరోపించారు. బీసీ మహిళగా, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖ విషయంలో మాత్రం ప్రభుత్వం అతిగా స్పందించి షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు.



## నారాయణపూర్ ముంపు గ్రామంగా ప్రకటించాలి

**గంగాధరలో ఉద్రిక్తం.. ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట**

గంగాధర, ఆగస్టు 22 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గంగాధర ప్రధాన రహదారిపై ధర్నాకు దిగడంతో శనివారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. భారీగా తరలివచ్చిన గ్రామస్తులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి బయలుదేరిన మహిళలను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకోవడంతో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. తోపులాటలో ముగ్గురు మహిళలకు చేతులకు గాయాలైనట్లు ఆందోళనకారులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఆందోళనకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మద్దతు తెలిపారు. కాగా, నారాయణపూర్ గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం, లాఠీచార్జ్ చేయడం సరికాదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పోలీసుల లాఠీచార్జ్‌లో షహీనా అనే మహిళ కాలు విరిగిందని, మరో మహిళ స్పృహ కోల్పోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటిస్తామని గతంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే సత్యం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని గ్రామ ప్రతినిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే కలెక్టరేట్, సీఎం, ఎమ్మెల్యే నివాసాల ముట్టడికి వెనుకాడబోమని రవిశంకర్ హెచ్చరించారు.



## పద్మారావునగర్ బీజేపీ అధ్యక్షుడిగా రఘురాం

పద్మారావునగర్, ఆగస్టు 22 (ఈవార్తలు): సనత్‌నగర్ నియోజకవర్గంలోని పద్మారావునగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా భోలక్‌పూర్‌కు చెందిన గుండు రఘురాం ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భారత్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం ప్రసాద్ మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా బీజేపీ కార్యకర్తగా పనిచేస్తూ వివిధ బాధ్యతలు నిర్వహించానని తెలిపారు. జిల్లా బీజేపీ యువ మోర్చా అధికార ప్రతినిధిగా కూడా సేవలందించినట్లు చెప్పారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు జి. భారత్‌గౌడ్, నాయకులు బి. శ్యాంసుందర్‌గౌడ్, మర్రి శశిధర్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## ఖండాంతరాలకు ఒగ్గుకథ ఖ్యాతి

అమెరికాలో ప్రదర్శన ఇచ్చిన మిద్దె వీనిత్‌కు ఘన సన్మానం

వేములవాడ అర్బన్, ఆగస్టు 22 (ఈవార్తలు): తెలంగాణ జానపద కళ అయిన ఒగ్గుకథను అమెరికాలోని ఓక్లాండ్‌లో ప్రదర్శించి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై చాటిన మిద్దె వీనిత్‌కు వేములవాడలో ఘన సన్మానం లభించింది. సిలికాన్‌ఆంధ్ర ఓక్లాండ్ మహాసభలో తెలంగాణ జానపద కళ అయిన ఒగ్గుకథను ప్రదర్శించి స్వగ్రామం వేములవాడకు తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనను, ఆయన తండ్రి, ప్రముఖ జానపద కళాకారుడు దివంగత మిద్దె రాములు వారసుడు మిద్దె పరశురాములును బీఆర్ఎస్ వేములవాడ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మిద్దె వీనిత్‌ను అభినందించారు. తెలంగాణ జానపద కళలకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఒగ్గుకథను గ్రామీణ వేదికల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో మిద్దె రాములు చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మిద్దె వీనిత్‌కు శ్రీ రాజరాజేశ్వర స్వామి, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.



## పారిశుధ్య కార్మికులతో జీవన్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు

జగిత్యాల, ఆగస్టు 22 (ఈవార్తలు): జగిత్యాల: పట్టణంలోని బైపాస్ రోడ్డులో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి, యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చల్గల్ నుంచి పనులకు వస్తున్నామని, కూలీ గిట్టుబాటు కావడం లేదని కార్మికులు తెలిపారు. తమ పిల్లలు దూరంలోని పాఠశాలకు ఆటోల్లో వెళ్తుండటంతో రవాణా ఖర్చులు భరించడం భారంగా మారిందని వాపోయారు. దీనిపై జీవన్‌రెడ్డి స్పందిస్తూ విద్యార్థుల వివరాలను సేకరించి జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రభుత్వ రవాణా భత్యం ద్వారా విద్యార్థులకు ఆటో ఛార్జీలు చెల్లించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల జాబితా సిద్ధం చేయాలని సర్పంచ్ జున్ను రాజేందర్‌కు సూచించారు.

# కరీంనగర్ కార్పొరేషన్‌పై ‘జెన్-జీ వాచ్‌డాగ్’ నిఘా

**అవినీతికి చెక్ పెట్టేందుకు 40-50 మందితో విజిలెన్స్ కమిటీ.. యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో ప్రత్యేక బృందం**

**కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**

కరీంనగర్, ఆగస్టు 22 (ఈవార్తలు): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నారు. నగరంలో తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ ‘జెన్–జీ విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీ’ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో రాజేందర్‌రావు ఈ కీలక ప్రకటన చేశారు. నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంజనీరింగ్ పనులు, టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా 40 నుంచి 50 మందితో ప్రత్యేక విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేస్తామని రాజేందర్‌రావు తెలిపారు. కమిటీలో యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో పాటు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న యువతను ఎంపిక చేస్తామని చెప్పారు. “అవినీతిని చూస్తూ ఊరుకునే పరిస్థితి ఇక ఉండదు. ప్రజల డబ్బుతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి లెక్క ఉండాలి. ప్రతి పనిపై ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండాలి” అని రాజేందర్‌రావు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఆర్టీఐ ద్వారా సేకరించి, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. ఏ డివిజన్‌లో ఏ పని మంజూరైంది? ఎంత నిధులు కేటాయించారు? టెండర్ విలువ ఎంత? పనులు ఎక్కడ జరుగుతున్నాయి? నాణ్యత ఎలా ఉంది? బిల్లులు ఎలా చెల్లించారు? వంటి అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. పేపర్లపై ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా ఉండే పరిస్థితులకు చెక్ పెట్టడమే వాచ్‌డాగ్ కమిటీ లక్ష్యమని పేర్కొన్నారు. అటు.. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను రాజేందర్‌రావు తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేకపోయినా ముఖ్యమంత్రి, మంత్రిపై అనుచితంగా విమర్శలు చేయడం సరికాదన్నారు. “రెండు మూడు సార్లు ఇదే విధంగా వ్యవహరించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మాత్రం సహించేది లేదు. ప్రజల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సుస్మిత క్షమాపణలు చెప్పాలి” అని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు



గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్, విక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంట శ్రీనివాస్ సర్పంచులు కమలాకర్ గౌడ్, తిరుపతిరెడ్డి బోగొండ ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకరు, జగ్గానీ కనకయ్య, ఎండి ఖాజా రావనవేని సంపత్, కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్ మూల కృష్ణారెడ్డి, గసికంటి కుమార్, సముద్రాల రమణారావు, వేల్పుల వెంకటేష్ అనంతుల రమేష్ జల్లోజు శ్రీనివాస్ పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కనకరాజు, వెలిచాల యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ ఉపసర్పంచ్ కాశీపాక రాకేష్, సలీం, చిందం శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకుడు కోహెడ వేణు, మీసా రమాదేవి కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, 22 ఏ భూ బాధితుల ఐక్యవేదిక అధ్యక్షుడు పాషా మోహన్ రెడ్డి, రేకుర్తి మాజీ ఉపసర్పంచ్ గొల్ల కృష్ణయ్య, సుధీర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి

**మహిళా విద్యాభివృద్ధికి ఆయన ఆశయాలే స్ఫూర్తి: గుత్తా సుఖేందర్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 22 (ఈవార్తలు): హైదరాబాద్ తొలి హిందూ కోత్వాల్, ప్రముఖ సంఘ సంస్కర్త, విద్యావేత్త రాజా బహదూర్ వెంకట రామారెడ్డి 157వ జయంతి వేడుకలను ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధి, సామాజిక సంస్కరణలు, సమాజ సేవలో రాజా బహదూర్ వెంకట రామారెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానం, సామాజిక బాధ్యతతో ఎదిగి సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. అచ్యుతాదేవి మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాజా బహదూర్ ఆశయాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఆయన కలలుగన్న సమాన విద్యా అవకాశాలను సాకారం చేసేందుకు కళాశాల కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఐదో న్యాక్ అక్రిడిటేషన్ చక్రంలో ‘ఏ’ గ్రేడ్ సాధించడం కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. అచ్యుతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ కె. సింధూరి, కరస్పాండెంట్ అండ్



సెక్రటరీ ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎంవీఎస్ సెక్రటరీ ప్రొఫెసర్ కె. ముత్యంరెడ్డి ఘనంగా సన్మానించారు. జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చర్చావేదిక, పుస్తక సమీక్ష, ఫొటోగ్రఫీ, ఎక్స్‌టెంపోర్ స్పీకింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్టూడెంట్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ డా. డబ్ల్యూ. శారద, కో–కన్వీనర్ డా. ఎం. పల్లవి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం కార్యక్రమాన్ని సమన్వయం చేసింది. జాతీయ గీతాలాపనతో వేడుకలు ముగిశాయి.

## చిరంజీవి జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

**స్వయంకృషితో మెగాస్టార్‌గా ఎదిగారు: బండి రమేష్**

కూకట్‌పల్లి, ఆగస్టు 22 (ఈవార్తలు): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రమ్య గ్రౌండ్స్‌లో అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి దిగ్గజాలు సినీ రంగాన్ని ఏలుతున్న సమయంలో చిరంజీవి తన స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగారని అన్నారు. తన ప్రత్యేకమైన నటనతో తెలుగు సినీ పరిశ్రమలో కొత్త ఒరవడిని సృష్టించారని పేర్కొన్నారు. చిరంజీవిని కేవలం నటుడిగా మాత్రమే చూడకూడదని, ఆయన చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతోమందికి ఉపయోగపడ్డాయని తెలిపారు. రక్తదాన కార్యక్రమాల ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడటంలో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ప్రతిభ, కృషి, పట్టుదలతో అగ్ర నటుడిగా ఎదిగి కోట్లాది మంది అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకున్న చిరంజీవి జీవన ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బండి రమేష్ అన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా అభిమాన సంఘాల



ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో గంధం రాజు, రంగమోహన్, సాయిబాబా చౌదరి, అరవింద్‌రెడ్డి, తూము మనోజ్, ఎల్. రాజా, నళినీకాంత్, శ్రీనివాస్‌బాబు, చావా శ్రీనివాస్, మస్తాన్‌రెడ్డి, శివ చౌదరి, హరిప్రసాద్ నాయుడు, గోపాల్ చౌదరి, కామినేని వాసు, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.



## నూకపల్లి సమస్యల పరిష్కారానికి నిధులు

**బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ పోరాటం ఫలితమే.. విశారదన్ మహరాజ్ వెల్లడి**

మల్యాల/జగిత్యాల, ఆగస్టు 22 (ఈవార్తలు): జగిత్యాల నూకపల్లి అర్బన్ డబుల్ బెడ్‌రూం కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సుమారు రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించడం తమ పోరాట ఫలితమేనని బీసీ–ఎస్సీ–ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డా. విశారదన్ మహరాజ్ అన్నారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నూకపల్లి కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న 15 ప్రధాన సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడంతో ఈ నెల 21న స్థానిక ప్రజలతో కలిసి మహాధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ధర్నా అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ప్రభుత్వ యంత్రాంగం స్పందించిందని పేర్కొన్నారు. కాలనీ మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి సుమారు రూ.30 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి జేఏసీ చేపట్టిన పోరాటం ఫలించిందని, బడుగు బలహీన వర్గాల సమస్యలపై తమ సంస్థ నిరంతరం పోరాడుతుందని విశారదన్ మహరాజ్ అన్నారు. సమావేశంలో జేఏసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మనల కిషన్, జగిత్యాల ఇన్‌చార్జి మ్యాడాబోయిన రాజారాం, ధర్మ సమాజ్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు దువ్వాక శివమహరాజ్, తిరుపతి, ఉపేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబులాపూర్‌లో కుల సంఘాల భవనాలకు శంకుస్థాపన

**ప్రభుత్వ పాఠశాలలో వంటగది ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యం**

మల్యాల, ఆగస్టు 22 (ఈవార్తలు): మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామంలో వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగది భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక నాయకులు, ప్రజలతో ఎమ్మెల్యే చర్చించారు. పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఓబులాపూర్ సర్పంచ్ గ్యాదాం కుమార్, ఉపసర్పంచ్ పొన్నం మల్లేశంగౌడ్, మాజీ సర్పంచులు బండి రవిగౌడ్, గుగ్గిళ్ల తిరుపతి, మొండయ్య, గడ్డం నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ పందిరి రజిత శేఖర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగారపు తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్లు నేరెళ్ల సతీష్‌రెడ్డి, కొల్లూరి గంగాధర్, రామ్‌లింగారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





## సంస్కృత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

**విద్య, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ: డీఈఓ నవీన్‌కుమార్**

వేములవాడ అర్బన్, ఆగస్టు 22 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న శ్రీ రాజరాజేశ్వర సంస్కృత పాఠశాల, కళాశాలలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు డీఈఓ నవీన్‌కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల, కళాశాలలో అధ్యాపకులు నిర్వహిస్తున్న బోధనా విధానాన్ని పరిశీలించిన డీఈఓ.. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు, తరగతుల నిర్వహణ, పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యాపరంగా, ఇతర సౌకర్యాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలను పరిశీలించారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ నాణ్యమైన, పరిశుభ్రమైన పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తరగతులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై శ్రద్ధగా చదువుకోవాలని, అనవసరంగా గైర్హాజరు కాకూడదని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. తనిఖీల ద్వారా పాఠశాల, కళాశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందేలా చర్యలు కొనసాగుతాయని డీఈఓ తెలిపారు.




## ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ పనులు

**నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 22 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులపై శనివారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన మేరకు కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ భీమ్లానాయక్, ఆలయ ఈవో రమాదేవి, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, స్థపతి మోతిలాల్, సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఎవరికీ బానిసలు కారు

## వాళ్లే దేశానికి అతిపెద్ద బలం.. పుణేలో విద్యార్థులతో రాహుల్ గాంధీ

పుణే: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, పితృస్వామ్య భావజాలంపై, ముఖ్యంగా 'మనుస్మృతి' నిర్దేశించిన పరిమితులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశానికి అసలైన బలం, అస్తి 70 కోట్ల మంది మహిళలేనని ఆయన స్పష్టం చేశారు. శనివారం పుణెలో "ఛాత్రోం కీ గూంజ్" కార్యక్రమంలో భాగంగా 'పింజ్రా తోడా' (పంజరాన్ని బద్దలుకొట్టండి) అనే థీమ్‌తో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "దేశానికి అతిపెద్ద బలం ఏమిటని అడిగితే ఆర్థిక వ్యవస్థ, సైన్యం, జనాభా అంటూ రకరకాల సమాధానాలు చెబుతారు. కానీ నా దృష్టిలో భారతదేశానికి ఉన్న 70 కోట్ల మంది మహిళలే దేశానికి అతిపెద్ద శక్తి" అని అన్నారు. మహిళలు ఎవరికీ బానిసలు కారని ఉద్ఘాటించారు. బాల్యంలో ఉన్నప్పుడు తండ్రికి పనులు చేసిపెట్టడం కోసం, యవ్వనంలో భర్త కోసం, ఆ తర్వాత వృద్ధాప్యంలో కొడుకుల కోసం మహిళలు బతకాలనే మనుస్మృతి భావజాలం సిగ్గుచేటని విమర్శించారు. కుమార్తె, భార్య, తల్లి వంటి పాత్రలకే పరిమితం కాకుండా మహిళలు తమకంటూ ఒక సొంత గుర్తింపును ఏర్పరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిషా అనే గిరిజన విద్యార్థిని ప్రసంగం అందరినీ కదిలించింది. గిరిజన విద్యార్థుల సమస్యలను ఆమె రాహుల్ గాంధీ దృష్టికి తీసుకొచ్చారు. పుణేలోని మంజరి ప్రాంతంలో తమ డిమాండ్ల సాధన కోసం గిరిజన విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్నారని, వారి దుస్థితిని వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన హాస్టళ్లలో కనీస వసతులు లేవని, 70-80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రీకృత వంటశాలల నుంచి ఆహారం సరఫరా చేయడం వల్ల అది పాడైపోయి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గడ్చిరోలిలోని ఆశ్రమ పాఠశాలలో పాముకాటు కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో



చికిత్స పొందుతున్నారని నిషా తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన గిరిజన విద్యార్థినులకు హాస్టళ్లలో బలవంతంగా గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని చెప్పడంతో సభలో నిశ్శబ్దం అలుముకుంది. ఈ సమస్యలపై మంత్రులను కలిస్తే ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉందని చేతులెత్తేశారని, అలాంటప్పుడు వారికి పదవిలో ఉండే అర్హత లేదని ఆమె నిలదీశారు. విద్యార్థిని ఆవేదనకు స్పందించిన రాహుల్ గాంధీ, వారి నిరసన శిబిరానికి తనను ఆహ్వానించమని కోరారు. "నన్ను నిరసన స్థలానికి పిలవండి, నేను తప్పకుండా వస్తాను. నా రాకతో ప్రభుత్వం, యంత్రాంగంపై ఒత్తిడి పెరుగుతుంది" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు.



# మెట్‌పల్లి సర్కారు దవాఖానలో ఎమ్మెల్యే సంజయ్ ఆకస్మిక తనిఖీ

మెట్‌పల్లి, ఆగస్టు 22 (ఈవార్తలు): కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రక్త పరీక్షలు, ఎక్స్‌రే సేవలు సక్రమంగా అందడం లేదని రోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడారు. అవసరమైన వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఎక్స్‌రే సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ఆసుపత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.

# మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం

రాయికల్, ఆగస్టు 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్, చెర్లకొండాపూర్ గ్రామాల మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కల్లెడ శేఖర్, కార్యవర్గ సభ్యులను దావ వసంత సురేష్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, కార్యదర్శి, డైరెక్టర్లు రాజం నారాయణ, నరేష్, సురేష్, లింగం, నవీన్‌తో పాటు గంగపుత్ర సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



# వేతనాల కోతను ఉపసంహరించాలి

**ఎమ్మెల్సీ ఎల్. రమణకు మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి**

జగిత్యాల, ఆగస్టు 22 (ఈవార్తలు): మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తూ సీ అండ్ డీఎంఏ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ డిపార్ట్‌మెంట్ ఓఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ నాయకులు శనివారం ఎమ్మెల్సీ ఎల్. రమణకు వినతిపత్రం అందజేశారు. జగిత్యాలలోని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లకు రూ.7,150, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.4,250, డ్రైవర్లకు రూ.2,900 వరకు వేతన కోత విధించడం అన్యాయమని తెలిపారు. పాత వేతనాలనే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేసి చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమస్యను శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఎల్. రమణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కూతురు నాగేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వులిసే శ్రీనివాసరావు, కోశాధికారి బోధన్‌కర్ మహేష్‌కుమార్, నాయకులు, సభ్యులు, కౌన్సిలర్ తోట హరీష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నీటి ప్రయోజనాలపై రాజకీయాలొద్దు

**కాళేశ్వరంపై కాంగ్రెస్ మాటలు అవాస్తవం**

**కోరట్ల ఎమ్మెల్యే సంజయ్ ఆరోపణలు**

జగిత్యాల, ఆగస్టు 22 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుష్ప్రచారానికి సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదిక చెంపపెట్టులాంటిదని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డలో ఒక బ్లాక్‌లోని రెండు పియర్స్‌కు మాత్రమే సమస్య ఉన్నట్లు నివేదిక వెల్లడించిందని, అన్నారం, సుందిళ్లలో నిర్మాణపరమైన సమస్యలు గుర్తించలేదని సంజయ్ తెలిపారు. కాళేశ్వరం నిర్మాణ నాణ్యత బాగుందని, కాంక్రీట్ నాణ్యత అత్యుత్తమంగా ఉందని నివేదిక పేర్కొన్నట్లు తెలిపారు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ ఒక్కటే కాదని, తమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు ఉన్న మొత్తం నీటి ఎత్తిపోతల వ్యవస్థను చూడాలని సూచించారు. కాళేశ్వరంపై రాజకీయ కక్షతో తెలంగాణకు వచ్చిన నీటిని సద్వినియోగం చేసుకోకుండా కిందకు వదిలేశారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఏర్పడే అవకాశం ఉన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమిటో ప్రజలకు వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలు పక్కనపెట్టి తెలంగాణ నీటి ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అవారి శివాకేసరి బాబు, దారిశెట్టి రాజేష్, అయిల్నేని వెంకటేశ్వర్‌రావు, అల్లాల ఆనంద్‌రావు, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, మున్నా, మహిపాల్‌రెడ్డి, తుమ్మ గంగాధర్, ఆనంద్‌రావు, సన్నిత్, గాజుల శ్రీనివాస్, అల్లాల రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# దీపావళికి కాలిఫోర్నియా అధికారిక గుర్తింపు

**హర్షం వ్యక్తం చేసిన హిందూ అమెరికన్ ఫౌండేషన్**

న్యూయార్క్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో దీపావళి పండుగకు అధికారిక గుర్తింపు లభించింది. ఈ మేరకు కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. కాలిఫోర్నియా రాష్ట్రంలోనూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులు, భారత సంతతి ప్రజల పట్ల తమకు ప్రగాఢమైన గౌరవం ఉందని ఈ తీర్మానంలో అసెంబ్లీ పేర్కొంది. భారత సంతతికి చెందిన అసెంబ్లీ సభ్యులు దర్శన పటేల్, యష్ కల్రా ఆగస్టు 13న 'హౌస్ రిజల్యూషన్ 137' పేరుతో ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. అసెంబ్లీ రూల్స్ కమిటీ పరిశీలన అనంతరం దీనికి ఆమోదం లభించింది. ఈ ఏడాది నవంబర్ 8న జరుపుకోనున్న దీపావళిని గుర్తిస్తూ, ఈ వేడుకల్లో కాలిఫోర్నియా ప్రజలు కూడా పాలుపంచుకోవాలని ఈ తీర్మానం ద్వారా అధికారికంగా పిలుపునిచ్చారు. ఈ చారిత్రక పరిణామంపై హిందూ అమెరికన్ ఫౌండేషన్ సోషల్ మీడియా ద్వారా హర్షం వ్యక్తం చేసింది. "కాలిఫోర్నియా దీపావళి తీర్మానం అధికారికంగా




ఆమోదం పొందింది" అని ప్రకటించింది. ఈ తీర్మానం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన దర్శన పటేల్, యష్ కల్రాలకు ఫౌండేషన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. తీర్మానం రూపకల్పనలో తమను సంప్రదించినందుకు కృతజ్ఞతలు చెప్పింది. దీపావళి పండుగకు భారతీయ అమెరికన్లు, దక్షిణాసియా అమెరికన్ల జీవితంలో గొప్ప ప్రాముఖ్యత ఉందని ఈ తీర్మానంలో వివరించారు. హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు ఏటా ప్రపంచవ్యాప్తంగా ఈ పండుగను ఘనంగా జరుపుకొంటారని పేర్కొన్నారు. 'దీపావళి' అంటే 'దీపాల వరుస' అని అర్థమని, ఇది ప్రపంచంలోని పురాతన పండుగల్లో ఒకటని తెలిపారు. ఈ పండుగ కుటుంబాలు, స్నేహితులు, సమాజాన్ని ఒకచోట చేర్చి ఉదారత, ఐక్యత, ఆనందం, కృతజ్ఞత వంటి విలువలను చాటుతుందని తీర్మానం కొనియాడింది. దీపావళి దీపాలు చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక అని అభివర్ణించింది. వ్యక్తిగత సవాళ్లు ఎదురైనా సానుకూల దృక్పథం, వినయం, దయను కొనసాగించాలనే సందేశాన్ని దీపావళి ఇస్తుందని పేర్కొంది. అనేక సమాజాలకు దీపావళి నూతన సంవత్సరానికి ఆరంభమని, ఇది జ్ఞానం, ఎదుగుదల, సంతోషానికి కట్టుబడి ఉండే సమయమని తీర్మానంలో పొందుపరిచారు.

# డీఎంకేలో కొత్త నాయకత్వం!

## పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక మార్పులు.. బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయోపరిమితి 45 ఏళ్లు

చెన్నై: డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక మార్పులు చేపట్టారు. పార్టీకి కొత్త రక్తాన్ని తీసుకురావడమే లక్ష్యంగా పలు కీలక పదవులకు వయోపరిమితి విధించడంతో పాటు.. వరుసగా రెండు పర్యాయాలకు మించి ఆ పదవుల్లో కొనసాగకుండా కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. చెన్నైలో జరిగిన డీఎంకే కార్యవర్గ సమావేశంలో ఈ మార్పులకు సంబంధించిన తీర్మానాలకు ఆమోదం లభించింది. ఈ సంస్కరణలు పార్టీ సంస్థాగత వ్యవస్థలో కొత్త నాయకత్వానికి అవకాశం కల్పిస్తాయని డీఎంకే వర్గాలు పేర్కొన్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి పార్టీ వర్గాల్లో కొత్త ఉత్సాహం నింపుతాయని భావిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయోపరిమితిని 45 ఏళ్లుగా నిర్ణయించారు. మున్సిపల్, సిటీ, టౌన్ పంచాయతీ వార్డు కమిటీ కార్యదర్శుల వయసు 50 ఏళ్లకు మించకూడదు. టౌన్ పంచాయతీ పార్టీ కార్యదర్శులు, ఏరియా కమిటీ కార్యదర్శులు, సిటీ కమిటీ కార్యదర్శులకు గరిష్ఠ వయోపరిమితిని 60 ఏళ్లుగా నిర్ణయించారు. జిల్లా పార్టీ కార్యదర్శుల పదవికి అత్యధికంగా 70 ఏళ్ల వరకు వయోపరిమితి విధించారు. ఈ పదవుల్లో ఎన్నికైన



వారు గరిష్ఠంగా రెండు టర్మ్ లు మాత్రమే కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. దీంతో పార్టీ పదవుల్లో కొత్తవారికి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. స్థానిక సంస్థాగత విభాగాల నిర్మాణంలోనూ డీఎంకే మార్పులు చేసింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ఒక్కో ఏరియా కమిటీ పరిధిలో సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా నిర్ణయించారు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ సంఖ్యను 30 వేలుగా నిర్ణయించారు. సిటీ కమిటీల పరిధిలో కూడా సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా తీర్మానం చేశారు. ఈ మార్పులను డీఎంకే ఎంపీ పి. విల్సన్ స్వాగతించారు. ఇవి పార్టీ సంస్థాగత వ్యవస్థలో మంచి నిర్మాణాత్మక సంస్కరణలని, అందరికీ మేలు చేసే నిర్ణయాలని ఆయన పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 30 వరకు పిల్లల ఆధార్ బయోమెట్రిక్

న్యూఢిల్లీ: పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌పై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కీలక ప్రకటన చేసింది. 5 నుంచి 17 ఏళ్లలోపు పిల్లలకు సంబంధించిన తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియను సెప్టెంబర్ 30 వరకు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఈ గడువు సమీపిస్తున్నందున తల్లిదండ్రులు వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. పిల్లలకు 5 సంవత్సరాలు, ఆ తర్వాత 15 సంవత్సరాలు నిండినప్పుడు వారి బయోమెట్రిక్ వివరాలను (వేలిముద్రలు, కనుపాప) తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాల్సి ఉంటుంది. వయస పెరిగే కొద్దీ పిల్లల బయోమెట్రిక్స్‌లో మార్పులు వస్తాయి కాబట్టి, ఆధార్ రికార్డుల కచ్చితత్వం కోసం ఈ అప్‌డేట్ అనివార్యం. పాఠశాల ప్రవేశాలు, పరీక్షలు, ఉపకార వేతనాలు (స్కాలర్‌షిప్‌లు), ఇతర ప్రభుత్వ పథకాల



ప్రయోజనాలు పొందడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసే సమయంలో కేవలం వారి ఫోటో, చిరునామా వంటి వివరాలను మాత్రమే సేకరిస్తారు. ఆ వయసులో వారి వేలిముద్రలు పూర్తిగా అభివృద్ధి చెందవు కాబట్టి బయోమెట్రిక్స్‌ను తీసుకోరు. కావున, ఆ పిల్లలకు ఐదేళ్లు నిండిన తర్వాత తొలిసారి, 15 ఏళ్లు నిండిన తర్వాత రెండోసారి బయోమెట్రిక్స్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలి. వాస్తవానికి, 2025 అక్టోబర్ 1 నుంచి ఏడాది పాటు ఈ సేవను యూఐడీఏఐ ఉచితంగా అందిస్తోంది. ప్రస్తుతం ఆ గడువు సెప్టెంబర్ 30తో ముగియనుండటంతో, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే సమీపంలోని ఆధార్ కేంద్రాలను సంప్రదించాలని యూఐడీఏఐ తల్లిదండ్రులకు సూచించింది.

# ఎయిర్‌పోర్టుల్లో ఈ-బోర్డింగ్

**సెప్టెంబర్ 1 నుంచి కొత్త రూల్**

న్యూఢిల్లీ: విదేశాలకు ప్రయాణించే భారతీయులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. 2026 సెప్టెంబర్ 1 నుంచి అంతర్జాతీయ ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద భౌతిక (ఫిజికల్) బోర్డింగ్ పాసులను సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. నూతన నిబంధనల ప్రకారం, ప్రయాణికులు తమ డిజిటల్ లేదా ఈ-బోర్డింగ్ పాస్‌లను చూపించి ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న బోర్డింగ్ పాస్‌లపై ముద్రలు (స్టాంపింగ్) వేసే పద్ధతికి స్వస్తి పలకనున్నట్లు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ప్రకటించింది. ఒకవేళ ప్రయాణికుల



వద్ద భౌతిక బోర్డింగ్ పాస్‌లు ఉన్నప్పటికీ వాటిని అనుమతిస్తారు, కానీ వాటిపై ఎలాంటి స్టాంపులు వేయరు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఈ మార్పు అమల్లోకి రానుందని ఢిల్లీలోని ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) ఒక అంతర్గత నోట్‌లో ధృవీకరించింది. ప్రస్తుత స్టాంపింగ్ విధానం వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురికావడంతో పాటు, అప్పుడప్పుడు ముద్రలు వేయడంలో పొరపాట్లు జరుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ గుర్తించింది. ఈ ఇబ్బందులను అధిగమించి, ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కొత్త నిబంధనపై విమానాశ్రయ యాజమాన్యాలు, సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అన్ని భాగస్వామ్య పక్షాలను ఆదేశించింది. సెప్టెంబర్ 1 నుంచి ఈ ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

# పాక్ రాజకీయం వంకరటింకర

**అన్నివైపులా షెహబాజ్‌కు ముప్పు**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. కీలక మిత్రపక్షమైన 'పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ' (పీపీపీ)తో విభేదాలు ముదురుతుండగా, ప్రతిపక్షాలు ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్నాయి. మరోవైపు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వైద్య చికిత్స వ్యవహారం కూడా ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెడుతోంది. ఆగస్టు 18న ఇమ్రాన్‌ను అడియాలా జైలు నుంచి రెండు రోజుల్లో ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ ఆసుపత్రికి తరలించాలని పాక్ సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఈ ఉత్తర్వులపై పునర్విచారణ కోరింది. భద్రతా కారణాలతో షిఫాకు బదులుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని పిమ్స్ ఆసుపత్రికి తరలించింది. వైద్య పరీక్షల తర్వాత కొన్ని గంటల్లోనే మళ్లీ జైలుకు పంపింది. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పాటించలేదంటూ ఇమ్రాన్ కుటుంబం, పీటీఐ ఆరోపించాయి. ఈ వ్యవహారం కోర్టు ధిక్కార కేసుకు దారితీసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో పీపీపీ అధినేత బిలావల్ భుట్టో జర్దారీ ప్రభుత్వం తీరుపై కఠిన వైఖరి తీసుకున్నారు. తమ అభ్యంతరాలు పరిష్కరించే వరకు సెనేట్, జాతీయ అసెంబ్లీలో ప్రభుత్వ బిల్లులకు మద్దతు ఇవ్వబోమని ప్రకటించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించిన పీపీపీ.. ఫలితాలను న్యాయస్థానంలో సవాల్ చేయాలని నిర్ణయించింది. కొత్త రాష్ట్రాల ఏర్పాటుపైనా విభేదాలు తలెత్తాయి. విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం లేకుండా ప్రభుత్వం ముందుకు సాగొద్దని బిలావల్ స్పష్టం చేశారు. మరోవైపు ప్రతిపక్షాలు కూడా ఐక్యంగా కదులుతున్నాయి. జేయూఐ-ఎఫ్ అధినేత మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ నేతృత్వంలో ఉమ్మడి పార్లమెంటరీ వ్యూహంపై చర్చలు సాగుతున్నాయి. సోమవారం కీలక ప్రతిపక్ష సమావేశం జరగనుంది. పీపీపీ మద్దతు దొరికితే షెహబాజ్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం దిశగా పరిణామాలు వేగంగా మారే అవకాశముంది.

# రూ.4 వేల కోట్ల సెటిల్‌మెంట్

**టిక్‌టాక్‌తో అమెరికా వివాదం ముగింపు**

వాషింగ్టన్: ప్రముఖ సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్, దాని మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ అమెరికాలో ఓ కీలక వివాదానికి ముగింపు పలికేందుకు సిద్ధమయ్యాయి. పిల్లల ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్ (సీఓపీపీఏ)ను ఉల్లంఘించి, వారి డేటాను అక్రమంగా సేకరించాయన్న ఆరోపణలపై యూఎస్ న్యాయ శాఖ దాఖలు చేసిన దావాను పరిష్కరించుకునేందుకు 400 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 3,828 కోట్లు) చెల్లించడానికి అంగీకరించాయి. ఈ సెటిల్‌మెంట్ ఒప్పందం ప్రకారం.. టిక్‌టాక్ 400 మిలియన్ డాలర్లు చెల్లిస్తుంది. ఈ ఒప్పందానికి కోర్టు ఆమోదం లభించాల్సి ఉంది. పిల్లల గోప్యతకు సంబంధించిన కేసుల్లో ఇది అతిపెద్ద సెటిల్‌మెంట్లలో ఒకటని యూఎస్ న్యాయ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. "ఈ సెటిల్‌మెంట్ అమెరికన్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు లభించిన గొప్ప విజయం. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని తీసుకునే కంపెనీలు చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చేలా చూడటమే మా ప్రాధాన్యత" అని అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ వుడ్‌వార్డ్ తెలిపారు.




# బతుకమ్మ పోటీలు.. 3 లక్షలు గెలిచే చాన్స్



ఈ ఏడాది బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరించారు. ఈ ఏడాది యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2 పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ ఎండీ, జీ ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలకు చోటు కల్పించారు. ఈ పోటీలను యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ..'ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయి. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని' అని అన్నారు. ఈ పోటీలకు పంపే లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని 2026 సెప్టెంబర్ 15లోపు 8125834009 వాట్సాప్ నంబరుకు పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష ఉండనుంది. వీటితో పాటు మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేలతో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేయనున్నారు.



# అమ్మే నా ప్రపంచం: జేసన్ విజయ్

తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ప్రస్తుతం తన తొలి సినిమా 'సిగ్మా' ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉన్నారు. సందీప్ కిషన్ హీరోగా, లైకా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంతో ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో జేసన్ సంజయ్ తన కుటుంబానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన తల్లిదండ్రులు, సోదరితో ఉన్న అనుబంధం గురించి ఆయన చాలా ఓపెన్‌గా మాట్లాడారు. తన జీవితంలో అమ్మ సంగీత పాత్ర ఎంత ముఖ్యమైనదో చెబుతూ జేసన్ భావోద్వేగానికి గురయ్యారు. "మా అమ్మ నా జీవితంలో అతిపెద్ద పిల్లర్. ఆమె రోజులో 24 గంటలూ నన్ను, మా చెల్లెలి గురించే ఆలోచిస్తూ ఉంటుంది. ఒకరోజు నేను ఆమెకు ఫోన్ చేయడం మర్చిపోతే చాలు, వెంటనే ఆమె నాకు రీచ్‌అవుట్ అయి 'ఈరోజు ఏం జరిగింది? అంతా బానే ఉందా?' అని ఆరా తీస్తుంది" అంటూ అమ్మ ప్రేమ గురించి చెప్పుకొచ్చారు. అలాగే తన తల్లిదండ్రుల గురించి మాట్లాడుతూ.. అమ్మ, నాన్నల దగ్గర కొన్ని విషయాలు పంచుకోవడానికి తాను కొంచెం భయపడతానని, ఎందుకంటే ఆ తరహా ఫ్రీ స్పేస్ వాళ్ళు తనకు చిన్నప్పుడు ఇవ్వలేదని నవ్వుతూ చెప్పారు. అయితే పేరెంట్స్‌తో చెప్పలేని ఎన్నో విషయాలను తాను తన సోదరితో మాత్రమే పూర్తిగా పంచుకుంటానని, ఆమె తన బెస్ట్ కాన్ఫిడెంట్ అని వెల్లడించారు. ఇక నాన్న విజయ్ గురించి చెబుతూ.. తన తండ్రి గురించి తనకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. ఇండస్ట్రీలో ఎవరి ప్రమేయం లేకుండా సొంతంగా కష్టపడి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని విజయ్ తనకు సూచించినట్లు జేసన్ గుర్తుచేసుకున్నారు. కాగా, జేసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న 'సిగ్మా' సినిమా అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.



# స్పిరిట్ వివాదం.. దీపిక క్లారిటీ!

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'స్పిరిట్' చుట్టూ అలుముకున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంపై నిర్మాత, సందీప్ రెడ్డి సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన ఆరోపణలకు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె పరోక్షంగా, కానీ చాలా బలంగా స్పందించారు. వంగా సోదరులను విమర్శిస్తూ రాసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను 'లైక్' చేయడం ద్వారా ఆమె తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ.. దీపిక ఈ సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని, డేట్స్ సర్దుబాటు చేయలేకపోయారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా చర్చలు విఫలమయ్యాక సినిమా కథ, పాత్రకు సంబంధించిన అంతర్గత విషయాలను ఆమె లీక్ చేశారని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్థికంగా తమకు వర్కవుట్ కాకపోవడం వల్లే ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని వివరించారు. ఈ ఆరోపణలపై దీపిక నేరుగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ, ఓ జర్నలిస్ట్ పెట్టిన పోస్ట్‌కు ఆమె మద్దతు తెలిపారు. "దీపిక 10% లాభం అడిగితే, మొత్తం వంగా ఆస్తిని అడిగినట్టు ఎందుకు ఫీల్ అవుతున్నారు? ఇది స్పష్టంగా మగ అహంకార సంక్షోభం. ఒక మహిళ 'నో' చెప్పడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు" అని ఆ పోస్ట్‌లో జర్నలిస్ట్ పేర్కొన్నారు. మొత్తానికి దీపిక నేరుగా స్పందించకపోయినా తన మద్దతు ద్వారా ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. కేవలం రెమ్యూనరేషన్, డేట్స్ సమస్యగా మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు ఇండస్ట్రీలో లింగ సమానత్వం, మగ అహంకారంపై తీవ్ర చర్చకు దారితీసింది.

## 'విశ్వంభర' మెగా ట్రీట్

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే కానుక లభించింది. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న భారీ బడ్జెట్ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్ ట్రాక్‌ను విడుదల చేసింది. ఈ అప్‌డేట్‌తో మెగా అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. విడుదల చేసిన కొత్త పోస్టర్‌లో చిరంజీవి అత్యంత పవర్‌ఫుల్, మెగా మాస్ అవతార్‌లో దర్శనమిచ్చారు. చేతిలో ఓ ప్రత్యేకమైన ఆయుధాన్ని పట్టుకుని, శత్రువులపైకి దూసుకెళుతున్నట్లుగా ఉన్న ఆయన లుక్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. "మెగా మాస్ బియాండ్ ది యూనివర్స్" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌ను ఈ పోస్టర్‌కు జోడించారు. పోస్టర్‌తో పాటు విడుదల చేసిన ఓఎస్టీ కూడా సినిమా థీమ్‌ను ప్రతిబింబిస్తూ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. యూవీ క్రియేషన్స్, ఏఏ ఆర్ట్స్, వీఆర్ గ్లోబల్ మీడియా సంస్థలు సంయుక్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



# ఆత్మవిశ్వాసమే అసలైన అందం

ఓవర్ నైట్ స్టార్‌గా మారిన త్రిప్తి డిమ్రి వరుస అవకాశాలు అందుకుంటున్నారు. 'యానిమల్' చిత్రంతో ఇండస్ట్రీకి వచ్చి తనదైన సత్తాచాటిన ఆమె తెలుగు, హిందీ ఇండస్ట్రీల్లో సినిమాలు చేస్తున్నారు. గత ఏడాది 'ధడక్-2' సినిమాతో విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ భామ.. తెలుగులో ఓ భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న 'స్పిరిట్'లో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకున్నారు. ప్రస్తుతం షూటింగ్‌లో పాల్గొంటున్న ఆమె.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేశారు. కాన్ఫిడెన్స్, గ్లామర్, ఆకర్షణ.. ఈ మూడింటిలో మీరు దేనికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తారని యాంకర్ అడగ్గా.. త్రిప్తి ఏమాత్రం తడబడకుండా ఆత్మవిశ్వాసమే అసలైన అందం అని చెప్పారు. తన దృష్టిలో కాన్ఫిడెన్స్ అనేది బయట నుంచి ఎక్కడి నుంచో తెచ్చుకునేది కాదని ఆమె అన్నారు. ఒక్కసారి మనపై మనకు పూర్తి నమ్మకం ఏర్పడితే మిగిలినవన్నీ దానంతట అవే మనల్ని అనుసరిస్తాయని తెలిపారు. వయసు పెరిగే కొద్దీ అందం, ఆకర్షణపై తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని త్రిప్తి వెల్లడించారు. చిన్నతనంలో కేవలం శారీరక రూపం, పైకి కనిపించే అందం మాత్రమే ముఖ్యమనుకునేదాన్నని, కానీ ఇప్పుడు తన ఆలోచన పూర్తిగా మారిందని చెప్పారు. నిజమైన ఆకర్షణ అంటే మనపై మనకున్న నమ్మకం, స్వయం గౌరవం, సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తి కలిగి ఉండటమేనని ఆమె చెప్పుకొచ్చారు. నలుగురిలోకి వెళ్లేముందు తనని తాను ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. ఇతరులతో సంబంధం ఏర్పరచుకోవడానికి ముందు, మన మనసుతో మనం కనెక్ట్ అవ్వడం అత్యంత కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు.



# విక్టరీల బాటలో మమితా బైజు

ప్రస్తుతం దక్షిణాదిలో మంచి క్రేజ్ ఉన్న హీరోయిన్ మమితాబైజు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అతి తక్కువ సమయంలో హీరోయిన్‌గా ఫుల్ ఫామ్ సొంతం చేసుకున్న ఈ అమ్మడు.. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటూ దూసుకుపోతుంది. ఈ మేరకు తాజాగా విడుదలైన తమిళ స్టార్ హీరో సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో మమిత తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు అదే జోష్‌తో మరో భారీ హిట్ సొంతం చేసుకుంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పాలీ, మమితా బైజు జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ సినిమాను రొమాంటిక్ కామెడీగా దర్శకుడు గిరీష్ ఎ డి రూపొందించారు. ఫహద్ ఫాసిల్, దిలీష్ పోతన్, శ్యామ్ పుష్కరన్ నిర్మించారు. మౌత్ టాక్‌తోనే మంచి రెస్పాన్స్‌తో దూసుకుపోతున్న ఈ చిత్రం టికెట్ బుకింగ్ ప్లాట్ ఫామ్స్‌లో భారీ స్థాయిలో బుకింగ్స్ జరుగుతున్నాయి. బుక్ మై షో లో గంటకు దాదాపు 25 వేల టికెట్ బుకింగ్స్ జరుగుతుండటం విశేషం. ఈ చిత్రంలో జస్టిన్ పాత్రలో నివిన్ పాలీ సాలిడ్ పర్ ఫార్మెన్స్‌కు ప్రతి ఒక్కరి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమా ఈ ఓనం పండుగ సూపర్ హిట్‌గా క్రిటిక్స్ చెబుతున్నారు. ఈ చిత్రంలోని కామెడీ, రొమాన్స్, ఎమోషన్స్, ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తున్నాయి.

# గాయత్రి-ట్రీసా జోడీకి కాంస్యం



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రీసా జాలీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. శనివారం జరిగిన హోరాహోరీ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఈ జోడీ పరాజయం పాలవడంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక అర్జున పురస్కారానికి ఎంపికైన ఈ ద్వయం, ఈ మెగా టోర్నీలోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. సెమీఫైనల్‌లో గాయత్రి-ట్రీసా జోడీ చైనాకు చెందిన లియు షెంగ్షు, టాన్ నింగ్ ద్వయంతో తలపడింది. మూడు గేమ్‌ల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ 21-18, 13-21, 8-21 తేడాతో ఓటమిని చవిచూసింది. తొలి గేమ్‌లో ఇరు జట్ల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఒక దశలో 16-18తో వెనుకబడినప్పటికీ, అద్భుతంగా పుంజుకున్న గాయత్రి-ట్రీసా 21-18తో గేమ్‌ను సొంతం చేసుకున్నారు. అయితే, ఆ తర్వాత చైనా జోడీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. రెండో గేమ్‌ను 21-13తో, నిర్ణయాత్మక మూడో గేమ్‌ను 21-8తో సునాయాసంగా గెలుచుకుని ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ ఓటమితో గాయత్రి-ట్రీసా జోడీ ప్రస్థానం కాంస్య పతకంతో ముగిసింది.





# వాన ముప్పు!

**కొలంబో టెస్ట్‌కు వరణుడి అడ్డంకి?.. నేటి నుంచి రెండో టెస్టు ప్రారంభం**

**భారత్, శ్రీలంక మధ్య రెండో టెస్టు ఆదివారం నుంచి కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్లో ప్రారంభం కానుంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో 165 పరుగుల ఘన విజయం సాధించిన టీమ్ ఇండియా 1-0 ఆధిక్యంలో ఉంది.**

సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ చూస్తుండగా, మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారే అవకాశం కనిపిస్తోంది. అంతేకాదు.. కొలంబోలో టెస్టు జరిగే ఐదు రోజులూ వేడి, ఉక్కపోతతో పాటు వర్షం, ఉరుములతో కూడిన జల్లులకు అవకాశం ఉందని

తాజా వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.



ఆగస్టు 23న వర్షం పడే అవకాశం ఉండగా, ఆగస్టు 24, 25 తేదీల్లో వర్షపు ముప్పు మరింత ఎక్కువగా ఉండొచ్చని కొన్ని అంచనాలు చెబుతున్నాయి. ఆగస్టు 26, 27 తేదీల్లోనూ అడపాదడపా జల్లులు కొనసాగే అవకాశం ఉంది. అయితే వర్షం ఉందంటే మ్యాచ్ పూర్తిగా రద్దవుతుందని అర్థం కాదు. తాజా అంచనాల ప్రకారం వర్షం ప్రధానంగా అడపాదడపా జల్లుల రూపంలో ఉండే అవకాశం ఉంది. దీంతో మ్యాచ్ మధ్యలో ఆట నిలిచిపోవడం, ఓవర్లు తగ్గడం వంటి పరిస్థితులు ఏర్పడవచ్చు. మరో వాతావరణ అంచనా ప్రకారం కొలంబోలో భారీ వర్షం నిరంతరంగా కురిసే అవకాశం తక్కువగా ఉండటంతో పూర్తి మ్యాచ్ వాష్‌అవుట్ అయ్యే ప్రమాదం మాత్రం పరిమితంగానే కనిపిస్తోంది.

గాలే టెస్టులోనూ వర్షం అంతరాయం

తొలి టెస్టులో వర్షం కారణంగా భారత్, శ్రీలంక జట్ల ఆటకు పలుమార్లు అంతరాయం ఏర్పడింది. రెండో రోజు ఆట కూడా దాదాపు నాలుగు గంటల ఆలస్యంతో ప్రారంభమైంది. అయినప్పటికీ భారత జట్టు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని 165 పరుగుల తేడాతో విజయం సాధించింది.. తొలి టెస్టులో దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, అరంగేట్ర ఆటగాడు మానవ్ సుతార్ బంతితో అదరగొట్టాడు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే ఆలౌట్ కావడంలో సుతార్ కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు కొలంబో వాతావరణం కూడా భారత జట్టుకు మరో పరీక్షగా మారనుంది.

# వికెట్ల కోసం తొందరొద్దు.. కుల్దీప్‌కు గంభీర్ సూచన

వికెట్లు తీయాలనే ఆత్రుతతో బౌలింగ్ చేయకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని భారత హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సూచించాడు. శ్రీలంకతో ఆదివారం ప్రారంభమయ్యే రెండో టెస్టు నేపథ్యంలో జట్టు కూర్పుపై చర్చ జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశాడు. గాలేలో జరిగిన తొలి టెస్టులో కుల్దీప్ ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడి స్థానం గురించి చర్చ జరుగుతోంది. జట్టులో సారాంశ్ జైన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ కూడా అందుబాటులో ఉన్నాడు. అయితే టెస్టు మ్యాచ్ గెలవాలంటే 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని ఎంపిక చేస్తామని గంభీర్ స్పష్టం చేశాడు. పరిస్థితులను బట్టి తుది జట్టును నిర్ణయిస్తామని చెప్పాడు. కుల్దీప్‌తో తన చర్చల గురించి మాట్లాడుతూ.. వికెట్ల కోసం అత్యాశ పడకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపాడు. రిస్ట్ స్పిన్నర్లు వికెట్ల కోసం ఆత్రుత పడితే బౌలింగ్‌పై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నాడు. కుల్దీప్ సామర్థ్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని గంభీర్ పేర్కొన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడు ప్రమాదకర బౌలర్‌గా మారగలడని తెలిపాడు. అయితే పరిస్థితులకు అనుగుణంగా ఫలితం ఇచ్చే బౌలింగ్ దళానికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశాడు. గాలే టెస్టు పిచ్‌పై కూడా గంభీర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. స్పిన్నర్లు, పేసర్లు, బ్యాటర్లకు ఆ పిచ్ సహకరించిందని అన్నాడు. ఐదు రోజుల పాటు తీవ్రంగా శ్రమిస్తేనే టెస్టు మ్యాచ్ గెలవగలమని చెప్పాడు. అలాగే ఐదుగురు ప్రధాన బౌలర్లతో ఆడటం జట్టుకు వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని పేర్కొన్నాడు. ఫ్లాట్ పిచ్‌లపై బౌలర్లను రొటేట్ చేసేందుకు ఇది అవకాశం ఇస్తుందని తెలిపాడు.

**లైక్స్, వ్యూస్ కాదు.. ట్రోఫీలే ముఖ్యం**

భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడొద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టం చేశాడు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పాడు. "మేం టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను పట్టించుకునేది అదే" అని గంభీర్ స్పష్టం చేశాడు.



# మళ్లీ వివాదంలో స్టీవ్ స్మిత్.. అంపైర్ల వార్నింగ్

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ మైదానంలో తన ప్రవర్తనతో మరోసారి వార్తల్లో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో డీఆర్ఎస్ రివ్యూ విషయంలో ప్రత్యర్థి జట్టును రెచ్చగొట్టేలా వ్యవహరించడంతో ఫీల్డ్ అంపైర్లు అతడిని హెచ్చరించారు. ఈ మ్యాచ్‌లో తస్కిన్ అహ్మద్ వేసిన బంతి స్మిత్ ప్యాడ్లను తాకడంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేశారు. అయితే ఫీల్డ్ అంపైర్ దానిని నాటౌట్‌గా ప్రకటించడంతో, రివ్యూ తీసుకోవాలా వద్దా అని కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో బౌలర్‌తో చర్చించాడు. బంతి వికెట్ల పైనుంచి వెళ్లే అవకాశం ఉందని తస్కిన్ భావించడంతో వారు రివ్యూకు వెళ్లలేదు. వీరిద్దరి మధ్య జరుగుతున్న సంభాషణను గమనించిన స్మిత్, రివ్యూ తీసుకోవాలంటూ బంగ్లా ఆటగాళ్లను ఉద్దేశించి వ్యంగ్యంగా సంజ్ఞలు చేశాడు. స్మిత్ తీరును గమనించిన ఫీల్డ్ అంపైర్లు వెంటనే అతడిని పిలిచి మందలించారు. ప్రత్యర్థి జట్టు నిర్ణయాల్లో జోక్యం చేసుకోవడం సరైనది కాదని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, స్మిత్ వంటి సీనియర్ ఆటగాడికి ఇలాంటి ప్రవర్తన తగదంటూ నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.



# తొలి బంతికే వికెట్.. స్టార్క్ రికార్డు

ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక టెస్టు మ్యాచ్ ఆరంభంలో, వేసిన తొలి బంతికే వికెట్ పడగొట్టడం అతనికి ఇది నాలుగోసారి కావడం విశేషం. ఈ అరుదైన ఘనత సాధించిన ప్రపంచపు తొలి బౌలర్‌గా స్టార్క్ చరిత్ర సృష్టించాడు. సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో స్టార్క్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. మ్యాచ్‌లో బౌలింగ్ ప్రారంభించిన అతను, తను వేసిన మొదటి బంతికే బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లాంను పెవిలియన్ పంపాడు. కామెరూన్ గ్రీన్ పట్టిన క్యాచ్‌తో షాద్మాన్ వెనుదిరిగాడు.



# సెమీస్ ఆశలు గల్లంతు

పురుషుల హాకీ ప్రపంచకప్-2026లో అమ్‌స్టెల్వీన్ వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన సెకెండ్ రౌండ్ మ్యాచ్‌లో 3-1 తేడాతో భారత్ ఓటమి పాలైంది. దీంతో భారత జట్టు సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ఈ కీలక మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన తేలిపోయింది. ఫస్ట్ హాఫ్‌లో ఇరు జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగింది. భారత డిఫెన్స్ డచ్ జట్టు ఎటాక్‌ను సమర్థవంతంగా అడ్డుకుంది. దీంతో మొదటి రౌండ్ ముగిసే సరికి ఇరు జట్లు కూడా తమ గోల్ ఖాతాను తెరవలేకపోయాయి. అయితే సెకెండ్ హాఫ్‌లో అయితే నెదర్లాండ్స్ చెలరేగిపోయింది. మ్యాచ్ మూడో క్వార్టర్‌లో డ్యూకో టెల్గెన్‌క్యాంప్ అద్భుతమైన గోల్‌తో డచ్ జట్టును 1-0 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. నాలుగో కార్వర్ట్‌లో థిజ్స్ వాన్ డామ్ మరో గోల్ సాధించి నెదర్లాండ్స్ ఆధిక్యాన్ని పెంచాడు. ఆ తర్వాత భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను పవర్ ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా భారత ఖాతాను తెరిచాడు. కానీ ఆ తర్వాత మరో గోల్‌ను భారత్ సాధించలేకపోయింది. ఇక చివరగా జ్స్ వాన్ డామ్ మరో గోల్ కొట్టి 3-1 తేడాతో నెదర్లాండ్స్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో డచ్ సెమీస్‌కు అర్హత సాధించింది. ఇక భారత్ సెమీస్‌కు అర్హత సాధించాలంటే అద్భుతాలు జరిగాలి. టీమిండియా తమ చివరి మ్యాచ్‌లో అర్జెంటీనాపై భారీ విజయం సాధించడమే కాకుండా, ఇతర జట్ల మ్యాచ్ ఫలితాలుపై కూడా ఆధారపడాల్సి ఉంటుంది.



# పట్టభద్రుడు పనికిరాడు!?

శ్రావణ వాణి

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో
నైపుణ్యాలు లేవు..
ఉద్యోగాలకు గ్యాడ్యుయేట్లు
సిద్ధంగా లేరు..
పరిశ్రమలకు అవసరమైన
స్కిల్స్ లేవు..

**కంపెనీలు ఇవే చెప్తున్నాయ్..**
**నీతి ఆయోగ్ ఇదే చెప్తోంది..**

**రాజకీయ నాయకులూ ఇదే చెప్తున్నరు..**
**మరి, 'స్కిల్స్' నేర్పాల్సిన బాధ్యత ఎవరిది?**
**విద్యార్థి కాలేజీలో చేరేటప్పుడు ఇంజినీర్ కాదు..**
**అతడిని ఇంజినీర్‌గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత.. కాలేజీది.**
**ఆ కాలేజీని నియంత్రించాల్సిన బాధ్యత.. ప్రభుత్వానిది.**



**శ్రావణ్ కుమార్ బొమ్మకంటి**
**ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్‌బీ.**
**9581291919**

ఇంజినీరింగ్ విద్యార్థి నాలుగేళ్లు కళాశాలలో చదివి బయటకు వచ్చిన తర్వాత అతనికి ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు లేవని తేలితే, అందుకు విద్యార్థినే ముద్దాయిగా నిలబెట్టడం ఎంతవరకు సమంజసం? ఫీజులు వసూలు చేసి, సకల సదుపాయాలతో విద్య అందిస్తామని హామీలు ఇచ్చి, చివరకు పరీక్షలు రాయించి డిగ్రీ పట్టా చేతిలో పెట్టడం వరకు మాత్రమే కళాశాలలు పరిమితమైతే బాధ్యత ఎవరిది? కళాశాలలదా? వాటిని నియంత్రించాల్సిన ప్రభుత్వాలదా? లేక నాలుగేళ్లుగా అందుబాటులో లేని ప్రయోగశాలలు, పరికరాలు, పరిశ్రమల శిక్షణను స్వయంగా వెతుక్కోవాల్సిన విద్యార్థులదా?

వాస్తవానికి, తెలుగు రాష్ట్రాల్లో.. కాదు కాదు.. దేశంలోని అనేక ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థుల పరిస్థితి ఇదే. పాఠ్యాంశంలో ఉన్న పరీక్షలకు అవసరమైన విషయాలు చదవడం, సెమిస్టర్ పరీక్షలు రాయడం, అంతర్గత మార్కులు సంపాదించడం, చివరకు డిగ్రీ పూర్తి చేయడం.. ఈ చక్రంలోనే నాలుగేళ్లు గడిచిపోతున్నాయి. విద్యార్థి ఇంజినీర్‌గా తయారవుతున్నాడా? లేక పరీక్షల్లో ఉత్తీర్ణుడవుతున్నాడా? అన్న ప్రాథమిక ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నే అసలైన అంశం. పుస్తకంలో ఉన్న సిద్ధాంతం చదివినంత మాత్రాన ఇంజినీర్ తయారవడదు. యంత్రాన్ని తాకాలి. పరికరాన్ని ఉపయోగించాలి. సమస్యను పరిష్కరించాలి. పరిశ్రమల్లో పనిచేసి చూడాలి. కొత్త సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి. కానీ అనేక కళాశాలల్లో ఇవన్నీ అందని ద్రాక్షగానే మారుతున్నాయి.

ఇంజినీరింగ్ విద్య కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కళాశాలల్లో ప్రవేశాల సమయంలో అత్యాధునిక ప్రయోగశాలలు, నిపుణులైన అధ్యాపకులు, పరిశ్రమలతో అనుసంధానం, శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు అంటూ భారీ ప్రచారం జరుగుతుంది. కానీ విద్యార్థి కళాశాలలో అడుగుపెట్టిన తర్వాత వాస్తవ పరిస్థితి వేరుగా ఉంటుంది. అనేక కళాశాలల్లో అవసరమైన స్థాయిలో ప్రయోగశాలలు లేవు. ఉన్నవాటిలో పాత పరికరాలు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా ప్రయోగశాలల ఆధునికీకరణ లేదు. పరిశ్రమలకు అవసరమైన నూతన సాంకేతికతపై శిక్షణ అంతంతమాత్రమే.

చాలా కాలేజీల్లో పేరుకే ల్యాబ్‌లు..
ఫొటోలకు సరిపోయే పరికరాలు..
రికార్డుల్లో నిండుగా కనిపించే సౌకర్యాలు..
ఈ విషయం కళాశాల యాజమాన్యాలకు తెలుసు;
ప్రభుత్వానికి తెలుసు;
తల్లిదండ్రులకు తెలుసు;
విద్యార్థులకు తెలుసు;
అయినా ఎవ్వరూ గట్టిగా మాట్లాడరు.
ఎందుకంటే వ్యవస్థ మొత్తం 'ఎలాగోలా గడిచిపోతోంది'.

ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివే వేలాది మంది విద్యార్థుల్లో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపికయ్యే వారి సంఖ్య అత్యంత స్వల్పం. కొన్ని కళాశాలల్లో అసలు చెప్పుకోదగిన స్థాయిలో ప్లేస్‌మెంట్లే ఉండవు. కొన్నిచోట్ల జరిగే నియామక ప్రక్రియలను మాత్రం భారీ విజయంగా ప్రచారం చేస్తారు. నాలుగేళ్లు చదివి, లక్షల రూపాయలు ఫీజులు చెల్లించి, చివరకు ఉద్యోగం కోసం బయట తిరిగే విద్యార్థిని చూసి "నీకు స్కిల్స్ లేవు" అనడం ఎంత సులభమో! కానీ ఆ నైపుణ్యాలు నేర్పాల్సిన కళాశాల ఏమి చేసిందన్న ప్రశ్న అడగడం మాత్రం ఎవరికీ ఇష్టం లేదు. విద్యార్థి కళాశాలలో చేరేటప్పుడు నైపుణ్యాలతో రాడు. వాటిని నేర్చుకోవడానికే వస్తాడు. నాలుగేళ్ల తర్వాత కూడా సరైన నైపుణ్యాలు లేకపోతే, ఆ విద్యా వ్యవస్థ వైఫల్యానికి అతడిని ఒక్కడినే బాధ్యుడిని చేయడం అన్యాయం. నీతి ఆయోగ్ నివేదిక కూడా ఉన్నత, సాంకేతిక విద్యలో పరిశ్రమలతో అనుసంధానం, పని అనుభవం, ఉద్యోగ సంబంధిత నైపుణ్యాల లోటును ప్రధాన సమస్యగా గుర్తించింది. డిగ్రీలు, డిప్లొమాలు, నైపుణ్య శిక్షణ మధ్య ఉన్న గోడలను కూల్చాలని, పరిశ్రమలతో అనుసంధానమైన విద్యను పెంచాలని సూచించింది. అంటే సమస్య విద్యార్థిలో మాత్రమే లేదన్నది స్పష్టమవుతోంది. సమస్య వ్యవస్థలో ఉంది.

ఇక్కడ ప్రభుత్వాల బాధ్యత మరింత ఎక్కువ.
కళాశాలల్లో సరైన మౌలిక వసతులు ఉన్నాయా?
విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణ అందుతోందా?
పరిశ్రమలకు అనుగుణంగా పాఠ్యాంశాలు మారుతున్నాయా?
అధ్యాపకుల నైపుణ్యాలు నవీకరించబడుతున్నాయా?
క్యాంపస్ నియామకాల పరిస్థితి ఏమిటి?
ఫీజులకు, సౌకర్యాలకు మధ్య సంబంధం ఉందా?

ఇలాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పర్యవేక్షణ వ్యవస్థ బలహీనంగా మారినప్పుడే పరిస్థితి ఇంత దూరం వచ్చింది. నిబంధనలు పాటించని కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు, తనిఖీలు చేసి నాణ్యతను నిర్ధారించాల్సిన వ్యవస్థలు ఏం చేస్తున్నాయన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కావాలి. ఫీజులు వసూలు చేయడంలో కఠినత్వం.. నాణ్యమైన విద్య అందించడంలో మాత్రం అలసత్వం అనే పరిస్థితి కొనసాగితే ఇంజినీరింగ్ విద్యార్థుల భవిష్యత్తు మరింత ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పుడు ప్రభుత్వాలు స్కిల్స్ గురించి గొప్పగా చెప్తున్నాయి. నైపుణ్యాభివృద్ధి కోసం కొత్త సంస్థలు అవసరమే. కానీ కొన్ని వందల లేదా వేల మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించి, లక్షల మంది విద్యార్థుల సమస్యకు పరిష్కారం దొరికిపోయిందని చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. దేశంలోని ప్రతి ఇంజినీరింగ్ కళాశాలలో నైపుణ్య శిక్షణ బలోపేతం కావాలి. ప్రతి విద్యార్థికి ఆధునిక ప్రయోగశాలలు, పరిశ్రమల అనుసంధానం, తప్పనిసరి ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు అందాలి. వందలాది ఇంజినీరింగ్ కళాశాలల్లో స్కిల్స్ ఎందుకు అందడం లేదన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

"అగ్రశ్రేణి సంస్థల్లో మెరుగైన ప్లేస్‌మెంట్లు నమోదవుతున్నప్పటికీ, వందల సాధారణ ఇంజినీరింగ్ కళాశాలల్లో క్యాంపస్ ఉపాధి అవకాశాలు పరిమితంగానే ఉన్నాయి. మెజారిటీ విద్యార్థులు కళాశాల గేటు దాటి ఉద్యోగాల కోసం పోటీ ప్రపంచంలోకి వెళ్లాలి. అప్పుడు గానీ.. వారికి స్కిల్స్ లేవు అని ముద్ర వేయడం ఎంతవరకు న్యాయం?"

"ఇంజినీరింగ్ విద్యార్థులకు స్కిల్స్ లేవని చెప్పిన నీతి ఆయోగ్, వాటి వెనుక ఉన్న పాత ల్యాబ్‌లు, బోధనా విధానం, పరిశ్రమల అనుసంధాన లోపాన్నీ గుర్తించింది. మరి తప్పు కేవలం విద్యార్థులదే ఎలా అవుతుంది?"

"నాలుగేళ్లు చదివిన విద్యార్థి డిగ్రీ తీసుకున్న తర్వాత ఎక్కడికి వెళ్తున్నాడు? ఉద్యోగం వచ్చిందా? నిరుద్యోగిగా ఉన్నాడా? వేరే రంగంలో పనిచేస్తున్నాడా? ప్రభుత్వం దగ్గరే పూర్తి లెక్కలు లేకపోతే ఇంజినీరింగ్ విద్యా వ్యవస్థ విజయాన్ని ఎలా కొలుస్తారు?"

"డిగ్రీ పట్టా ఇచ్చిన తర్వాత విద్యార్థికి స్కిల్స్ లేవని చెప్పడం అత్యంత సులభం. కానీ ఆ నాలుగేళ్లలో స్కిల్స్ నేర్పేందుకు కళాశాల ఏం చేసింది? దాన్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఏం చేసింది? ఈ రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా విద్యార్థినే ముద్దాయిగా నిలబెట్టడం విద్యా వ్యవస్థ చేసిన అతిపెద్ద మోసం."

## బాధ్యులెవరు?

**1. విద్యార్థులా..?**
- కళాశాలలో చేరేటప్పుడు నైపుణ్యాలు నేర్చుకోవడానికే వస్తారు.

**2. కళాశాలలా?**
- ఫీజులు తీసుకొని ఆధునిక ల్యాబ్‌లు, పరిశ్రమల శిక్షణ, నాణ్యమైన బోధన అందించాల్సి వీళ్లేగా.

**3. ప్రభుత్వమా?**
- ప్రమాణాలు, తనిఖీలు, నాణ్యత, నియంత్రణ బాధ్యత ప్రభుత్వానిదే.

ప్రతి ఇంజినీరింగ్ కళాశాల తప్పనిసరిగా పలు వివరాలను బహిరంగంగా ప్రకటించేలా నిబంధనలు ఉండాలి. ఎంత మంది విద్యార్థులు చేరారు? ఎంత మంది పాస్ అయ్యారు? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి? సగటు జీతం ఎంత? ఎన్ని కంపెనీలు వచ్చాయి? ఎన్ని మంది విద్యార్థులు వేరే రంగాలకు వెళ్లారు? ల్యాబ్‌లు నిజంగా పనిచేస్తున్నాయా? ప్రతి ఇంజినీరింగ్ కళాశాలకు పబ్లిక్ ప్లేస్‌మెంట్ రిపోర్ట్ తప్పనిసరి చేయాలి. నైపుణ్యాల కోసం కొత్త పేర్లు, కొత్త యూనివర్సిటీలు, కొత్త పథకాలు ప్రకటించడం మాత్రమే పరిష్కారం కాదు. కళాశాలల్లో ఇప్పటికే ఉన్న లోపాలను ప్రభుత్వం సరిచేయాలి. డిగ్రీని మార్కుల పత్రంగా కాకుండా, ఉద్యోగ సామర్థ్యానికి గుర్తింపుగా మార్చాలి. ప్రతి కళాశాలకు అవసరమైన కనీస నైపుణ్య ప్రమాణాలు నిర్ణయించాలి. ప్రయోగశాలలు, పరికరాలు, అధ్యాపకుల నాణ్యత, పరిశ్రమల అనుసంధానం, విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లు, క్యాంపస్ నియామకాలపై బహిరంగ సమాచారం అందుబాటులో ఉంచాలి. విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులకు తగ్గ వసతులు అందిస్తున్నారా లేదా అన్నది ప్రభుత్వమే తేల్చాలి. విద్యార్థి నైపుణ్యవంతుడు కాకపోతే అతడి వైఫల్యం మాత్రమే కాదు.. అతడిని తీర్చిదిద్దలేకపోయిన కళాశాల వైఫల్యం. ఆ కళాశాలలను నియంత్రించలేకపోయిన ప్రభుత్వ వైఫల్యం కూడా. ఇకనైనా ఇంజినీరింగ్ విద్యార్థులపై నింద మోపడం మానాలి. "స్కిల్స్ లేవు" అని విమర్శించే ముందు, "స్కిల్స్ నేర్పేందుకు మేం ఏం చేశాం?" అని ప్రభుత్వాలు, కళాశాల యాజమాన్యాలు తమను తాము ప్రశ్నించుకోవాలి. డిగ్రీ పట్టా ఇచ్చిన తర్వాత విద్యార్థికి ఉద్యోగ నైపుణ్యాలు లేవని చెప్పడం సులభమే. కానీ ఆ నాలుగేళ్లు అతడికి నైపుణ్యాలు నేర్పాల్సిన బాధ్యతను ఎవరు నిర్వర్తించారు? అన్నదే అసలు ప్రశ్న.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.